


సచివాలయంలో మద్యం బాటిళ్లు

రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీలో ఇద్దరు వీఆర్వోల నిర్వాకం... 7లో





పోలవరానికి సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఉదయం పది గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.45గంటలకు పోలవరం ప్రాజెక్టు వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ఆయనకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలుకుతారు. 10.50 గంటలకు బయల్దేరి పోలవరం ప్రాజెక్టు సైట్‌లోకి వెళతారు. 12.05 గంటల వరకు గ్యాప్-1, వైబ్రో కాంపాక్షన్, గ్యాప్-2 పనులను పరిశీలించి డయాఫ్రంవాల్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తారు. అక్కడి నుంచి బయల్దేరి 12.20 గంటలకు పోలవరం గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 12.50 గంటల వరకు పోలవరం ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణ పరిస్థితిపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 1.15 గంటల వరకు మీడియా సమావేశం నిర్వహిస్తారు. 1.25 గంటలకు హెలికాప్టర్లో బయల్దేరి 2.15 గంటలకు వెలగపూడిలోని సెక్రటేరియట్‌కు చేరుకుంటారు.

ఇక్కడి నుంచే షెడ్యూల్ ప్రకటన?

ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి అవసరమైన షెడ్యూల్‌ను చంద్రబాబు ఇక్కడి నుంచే ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో సీఎం హోదాలో చంద్రబాబు పోలవరం పనులను పరుగులు పెట్టించిన సంగతి తెలిసిందే. ప్రతి సోమవారం పోలవరం వచ్చేవారు. 2019కి సుమారు72 శాతం పనులు పూర్తి చేయించారు. స్పిల్‌వే గేట్లు కూడా పెట్టి ఒక కొలిక్కి తెచ్చారు. ఎగువ కాఫర్ డ్యామ్, డయాఫ్రంవాల్‌లను నిర్మించారు. దిగువ కాఫర్ డ్యాం పనులు మొదలుపెట్టారు. కుడి ప్రధాన కాలువ పనులను ఒక కొలిక్కి తేగా, ఎడమ ప్రధాన కాలువ పనులు కూడా పరుగులు పెట్టించిన సంగతి తెలిసిందే. మరోపక్క పోలవరం విద్యుత్ ప్రాజెక్టు పనులను కూడా మొదలు పెట్టించారు. కానీ 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో రివర్స్ టెండరింగ్, ఎంక్వయిరీలు అంటూ జాప్యం చేసి చివరకు ప్రాజెక్టును కదలకుండా చేసిన సంగతి తెలిసిందే.

● (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉదయం 10.50 గంటలకు పోలవరం సందర్శనకు సీఎం చంద్రబాబు

ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణపై సమీక్ష

కూటమి రాకతో..చిగురించిన ఆశలు

2019కు ముందు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రం నలుమూలల నుంచి సందర్శకులను రప్పించి ప్రాజెక్టు పనులు చూపించారు. వైసీపీ ప్రభుత్వంలో కనీసం మీడియా కూడా పోలవరం ప్రాజెక్టు చూడ్డానికి వెళ్తే అనేక నిబంధనలు విధించేవారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి భారీ మెజార్టీతో అధికారం లోకి రావడంతో పాటు తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ఆశలు చిగురించాయి. కేంద్రం కూడా తోడవ్వడంతో ప్రాజెక్టు త్వరగా పూర్తవుతుందనే నమ్మకం ఏర్పడింది.

వైసీపీ హయాంలో అస్తవ్యస్తం

వైసీపీ హయాంలో ఏమి జరిగిందో కానీ డయాఫ్రంవాల్ దెబ్బతింది. ఇవాళ దీనికి సమాంతరంగా కొత్త డయాఫ్రంవాల్ నిర్మించనున్నారు. గతనెలలో నిపుణుల కమిటీ పర్యటించి డయాఫ్రంవాల్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అమెరికా, కెనడా నిపుణులతో కలసి పీపీఏ, సీడబ్ల్యుసీ, జలవనరుల శాఖ అధికారులు, ఇతర నిపుణులు కలిసి గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దెబ్బతిన్న డయాఫ్రంవాల్‌కు సమాంతరంగా మరో డయాఫ్రంవాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. నాలుగు రోజుల పాటు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డయాఫ్రంవాల్, ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ నిర్మాణం, డిజైన్లు, మెటీరియల్ ఏమి వాడాలి, టెస్టులు ఎలా చేయాలనే దానిపై పోలవరం ప్రాజెక్టు వద్ద వర్క్ షాపు నిర్వహించిన సంగతి తెలిసిందే. చివరిరోజు రాజమహేంద్రవరంలోని మంజీరా ఇంటర్నేషనల్ హోటల్‌లో నిపుణుల కమిటీ ఫైనల్ మీటింగ్ జరిగింది. సుమారు 4గంటల సమయం పాటు అక్కడ నిపుణులు, అధికారులు, కాంట్రాక్టర్, కన్సల్టెన్సీ నిపుణులు చర్చించారు. ప్రస్తుతం ఉన్న డయాఫ్రంవాల్‌కు 6 మీటర్ల దూరం నుంచి సమాంతరంగా కొత్త డయాఫ్రంవాల్ నిర్మించనున్నారు. దీని డిజైన్లు, వాడవలసిన మెటీరియల్స్, వాటి నాణ్యత ఎలా ఉండాలి. ఎటువంటి టెస్టులు నిర్వహించాలనే అంశంపై చర్చ జరిగింది. అఫ్రీ కన్సల్టెన్సీ డిజైన్, మెటీరియల్స్ నాణ్యత వివరాలపైనా చర్చించారు. డయాఫ్రంవాల్ పనులు జనవరి నుంచి మొదలు కానున్నాయి. పనుల షెడ్యూలును చంద్రబాబు స్వయంగా ఇక్కడే ప్రకటించే అవకాశం ఉంది. డయాఫ్రంవాల్ పనులు మొదలెట్టిన తర్వాత ప్రధాన డ్యామ్ ఈసీఆర్‌ఎఫ్ పనులు మొదలుపెట్టి 2027కు పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు వెళ్లనున్నారు.

నేడు జీజీహెచ్ అభివృద్ధి సంఘ సమావేశం



కూటమి ప్రభుత్వంలో తొలిసారి కావడంతో ప్రాధాన్యత

వైద్య సేవల్లో నిర్లక్ష్యం, ఇతర సమస్యలపై చర్చించే అవకాశం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీజీహెచ్) అభివృద్ధి సంఘం సమావేశం సోమవారం జరగనుంది. చైర్మన్, కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ఆసుపత్రిలోని ఎంసీహెచ్ మీటింగ్ హాలులో సమావేశం ఏర్పాటుచేశారు. ఆసుపత్రి అభివృద్ధి సంఘం సభ్యులైన ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సభ్యులందరికీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ సమాచారం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. కలెక్టరగా ప్రశాంతి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కూడా ఇదే కావడం గమనార్హం. గతంలో పలుమార్లు సమావేశం జరిపేందుకు ప్రయత్నాలు చేసినా అనివార్య కారణాల వల్ల వాయిదాపడ్డాయి. ఈ నేపథ్యంలో జరగనున్న తొలి సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు, ఏమి చర్చిస్తారు అనేదానిపై ఆసక్తి నెలకొంది.

జిల్లా ఆసుపత్రి నుంచి బోధనాసుపత్రి స్థాయికి ఎదిగినాజీజీహెచ్‌లో కీలకమైన రేడియాలజీ విభాగానికి రేడియాలజిస్ట్ లేకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. కొన్ని నెలలుగా ఈ సమస్య వేధిస్తున్నా పరిష్కారం కాలేదు. దీంతో ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ స్కానింగ్ రిపోర్టులుసకాలంలో అందక రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సీటీ స్కాన్ రిపోర్టులు రావడానికి రెండు, మూడు రోజుల సమయం పడుతోంది. ఎక్స్‌రే విభాగంలోనూ సేవలు ఆలస్యం అవుతున్నాయి. ఎక్స్‌రే తీసిన తర్వాత అక్కడి టెక్నీషియన్లు పది, ఇరవై ఫోటోలను ఒకేసారి సంబంధిత డాక్టర్లకు వాట్సాప్‌లో పంపుతున్నారు. ఒక్కోసారి నెట్ సిగ్నల్ సరిగా లేకపోతే వాటిని డాక్టర్లు చూడలేక వైద్య సేవల్లో జాప్యం జరుగుతోంది. మరోపక్క సాంకేతిక కారణాలతో ఎంఆర్ఐ పనిచేయకపోవడంతో ఎంఆర్ఐ కోసం డాక్టర్లు బయటకు రాస్తున్నారు. అక్కడ ఉచితంగానే ఎంఆర్ఐ చేస్తున్నా వెళ్లి చేయించుకోవడం, రిపోర్టు పట్టుకుని మళ్లీ ఆసుపత్రికి రావడం వల్ల రోగులు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. సీటీ స్కాన్, ఎక్స్‌రే సేవల్లో తీవ్ర జాప్యం నెలకొంటోంది. ఇలా ఒక్క రేడియాలజిస్ట్ లేకపోవడంతో సంబంధిత సాంకేతిక వైద్య సేవలన్నింటిపైనా తీవ్ర ప్రభావం పడుతోంది.

న్యూరోసర్జన్ విభాగంలోనూ సమస్యలున్నాయి. న్యూరోసర్జన్ ఉన్నా థియేటర్ లేకపోవడంతో సర్జరీలు జరగట్లేదు. మరోపక్క జనరల్ మెడిసిన్ విభాగంలో రోగులకు అందించే అత్యవసర వైద్య సేవలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెడికల్ జనరల్ వార్డుల్లో ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులను చూడ్డానికి సంబంధిత వైద్యులు సకాలంలో రావట్లేదని, గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందనే ఫిర్యాదులు ఎమ్మెల్యేకు ఆసుపత్రి అధికారులకు అందుతున్నాయి.

వైద్య సేవల తీరు మారేనా?

రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇప్పటికే పలుమార్లు జీజీహెచ్‌కు వచ్చి రోగుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. వాటిని ఆసుపత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. కొన్ని సందర్భాల్లో వైద్యులపైనా ఆయన గట్టి హెచ్చరికలు చేశారు. అసెంబ్లీలోనూ ఆసుపత్రి సమస్యలను ప్రస్తావించారు. అయినా వైద్య సేవల్లో నిర్లక్ష్యం పోవడం లేదనే ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం జరిగే హెచ్‌డీఎస్ సమావేశంలో సిటీ ఎమ్మెల్యే ఏం మాట్లాడతారనేది ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. జీజీహెచ్ ఉన్నతాధికారులు ఆసుపత్రిలోని సౌకర్యాలు, ఇతర సమస్యలతో పాటు ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల వివరాలను అజెండాలో పెట్టారు. ఇలా వీటన్నింటిపైనా సమావేశంలో కాస్త వాడివేడిగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే... సోమవారం సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వస్తున్నారు. దానికి కలెక్టర్ హాజరయ్యే అవకాశం ఉందని, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం నిర్వహిస్తారని సమాచారం.

కన్నేశారు!

అసైన్డ్ భూముల్లో యథేచ్ఛగా లే-అవుట్లు

కాలువలను పూడ్చి లే-అవుట్లకు రహదారులు

చోద్యం చూస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ, రుడా అధికారులు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంతా మా ఇష్టం... మమ్మల్ని అడిగే వారెవరు... ఏదైనా వస్తే మేము చూసుకుంటాం... అంటూ నాయకులు భరోసా ఇస్తుండడంతో రెవెన్యూ అధికారులు వారికి వత్తాసు పలుకుతూ చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అడంగళ్లలో పేరు మార్పులు, ప్రభుత్వ భూములు ఇతరులకు బదలాయింపు, చివరికి అసైన్డ్ భూములను అమ్ముకునేందుకు, ఆపై భూములను ఫిల్లింగ్ చేసి లే-అవుట్లుగా మార్చేందుకు కూడా రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సాధారణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీల స్థితిగతులను బట్టి వారిలో కొందరికి ప్రభుత్వం భూములను, మరికొందరికి స్థలాలను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. అయితే ఆ భూమిపై ఫలసాయం మాత్రమే అనుభవించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిని అమ్మడం కానీ, లే-అవుట్లు వేయడం కానీ చేయకూడదు. ఇక్కడ అలాంటిదేమీలేదు...

రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వున్న గ్రామంలోనే అసైన్డ్ భూమిలో వున్న కొబ్బరి చెట్లను నరికి ఆగమేఘాలపై ఎర్ర మట్టితో ఫిల్లింగ్ చేసి లే-అవుట్ వేసేందుకు సర్వం సిద్ధం చేశారు. ధవళేశ్వరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.47/1ఎ1లో 0.4150 ఎకరాలు వీర్రాజు పేరున, సర్వే నెం.47/1ఎ2లో 0.4150 ఎకరాలు సత్యనారాయణ పేరున వున్నాయి. అయితే అవి వీరికి గతం లో ఎలా సంక్రమించాయో తెలియదు. అడంగల్‌లో సదరు భూముల పేరున శిస్తుకట్టిన గయాల్, అసైన్డ్ ల్యాండ్ డి-పట్టాగా అడంగల్‌లో నమోదైంది. సర్వే నెం.18లో సుమారు 23 సెంట్ల కాలిబాటను కూడా సదరు వ్యక్తులకు ధారాదత్తం చేశారు. ఈ భూమిని రూరల్ నియోజకవర్గ పరిధిలో ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఒక నేతకు అమ్మినట్టు, అడ్వాన్స్‌గా సుమారు రూ.50లక్షల వరకు చేతులు మారినట్టు సమాచారం.

ఇరిగేషన్ భూమికి సంబంధించి అదే గ్రామంలో సర్వే నెం.216, 211ల్లో పంట కాలువను మూసివేసి లే-అవుట్ మార్గంగా చూపించి 'రుడా' నుంచి అనుమతులు తెచ్చుకున్నట్టు తెలిసింది.

ధవళేశ్వరం పంచాయతీ పరిధిలో ఇరిగేషన్ స్థలాలైన సర్వే నెం.72/1ను ఆక్రమించుకుని వాటర్ సర్వీసింగ్ స్టేషన్లు. సర్వే నెం.75, 76, 47/1 ఆక్రమించుకుని నర్సింగ్ కాలేజీ, విద్యా సంస్థల హాస్టళ్లతో పాటు పలు వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

సర్వే నెం.144లో దేవదాయ శాఖ స్థలాలను ఆక్రమించుకుని ఏకంగా ఇళ్లే కట్టేసుకున్నారు. ఇందుకు పంచాయతీ అధికారులు ప్లాన్ అప్రూవల్స్ మంజూరు చేసినట్టు తెలిసింది.

అయితే ఫిల్లింగ్‌కు మట్టిని ఎక్కడి నుంచి తెచ్చారు. సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బందికి తెలియకుండానే ఇదంతా జరిగిందా అన్నదే ప్రశ్న. అధికారులు వారిపై ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాలి.



ఎర్ర మట్టితో భూమిని చదును చేసిన దృశ్యం

రైతులను పట్టాలు తీసుకురమ్మన్నాం...

అసైన్డ్ భూముల్లో లే-అవుట్లు వేసేందుకు ఎర్ర మట్టి ఫిల్లింగ్ చేసిన విషయమై రూరల్ తహసీల్దారు కుమార్‌ను వివరణ కోరగా... ఈ అంశం తమ దృష్టికి వచ్చిందన్నారు. స్థలాన్ని పరిశీలించి పట్టాలు తీసుకురమ్మని సంబంధిత రైతులకు కబురు చేశామని తెలిపారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ, అధికారులు

భాషాప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన యోధుడు పొట్టి శ్రీరాములు

జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భాషాప్రయుక్త రాష్ట్రం కావాలని దేశంలో తొలిసారిగా పోరాడి ప్రాణాలర్పించిన యోధుడు పొట్టి శ్రీరాములు అని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. అమరజీవి వర్ధంతి సందర్భంగా రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌లో ఆ మహనీయుని చిత్రపటానికి పలువురు పుష్పమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడేవారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని శ్రీరాములు ఆమరణ దీక్ష చేశారని గుర్తు చేశారు. అటువంటి మహనీయులు స్ఫూర్తితో మనమంతా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీపీవో ఎల్.అప్పలకొండ, బీసీ సంక్షేమ శాఖ జిల్లా ఇన్చార్జి అధికారి కేఎన్ జ్యోతి, పౌరసరఫరాల జిల్లా మేనేజరు టి.రాధిక, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఆలీ, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అధికారులు నివాళులర్పించారు. డీఈవో కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి జిల్లా విద్యా శాఖ అధికారి వాసుదేవరావు నివాళులర్పించారు.

రాజమహేంద్రవరం అర్బన్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం, స్ఫూర్తిని భావితరాలకు తెలియజేసేందుకు ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినోత్సవంగా కూటమి ప్రభుత్వం నిర్ణయించి జరపడం హర్షణీయమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలుపుతాం, నవ్యాంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.



సంఘటనా ప్రాంతంలోనే దాడికి ఉపయోగించిన కత్తి

వేట్లపాలెం... రక్తసిక్తం

వేట్లపాలెం రక్తసిక్తమైంది.. ఇంటి స్థలం సరిహద్దు వివాదం.. పెను విషాదానికి దారితీసింది. ఒక వర్గం మరొక వర్గంపై చేసి దారుణ దాడిలో మూడు నిండు ప్రాణాలు బలవ్వగా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామ శివారులోని దళిత చెరువు ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈ దారుణం జరిగింది..... వివరాలు 7లో

కోట సత్తెమ్మ అమ్మవారి తిరునాళ్లు ప్రారంభం

నిడదవోలు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోట సత్తెమ్మ అమ్మవారి తిరునాళ్లు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవులపల్లి కుటుంబీకులతో స్మార్త ఆగమ ఆచారం ప్రకారం కలశస్థాపన చేయించి ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన, విశేష పూజలు జరిపారు. ఉదయం చండీ పారాయణ, సాయంకాలం చండీ హోమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను దేవస్థానం సహాయ కమిషనరు వి.హరి సూర్యప్రకాష్ పర్యవేక్షించగా ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కలశస్థాపన చేసి పూజలు చేస్తున్న దేవులపల్లి కుటుంబీకులు

శెట్టిబలిజ కులాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వెన్నుదన్ను: మంత్రులు దుర్గేష్, సుభాష్



దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం లాలాచెరువు సెంటర్లో శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. రాత్రి జరిగిన వెన్నుదన్ను సభలో శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు, 15 మంది సభ్యులతో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రమాణం చేయించారు. సభలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కార్మిక శాఖ మంత్రి సుభాష్, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, తెలంగాణ శెట్టిబలిజ సంఘం నేతలు జయప్రకాష్‌నారాయణ, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ప్రసంగించారు. శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, యాత కులాల అభివృద్ధికి పాటుపడింది టీడీపీయే అని గుర్తు చేశారు. శెట్టిబలిజ, గౌడ, శ్రీయన, ఈడిగ కులాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గీత కులాల అభివృద్ధికి కార్పొరేషన్ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతి ప్రయోజనాలను కాపాడతానని చైర్మన్ సత్తిబాబు హామీనిచ్చారు. వెన్నుదన్ను సభలో శెట్టిబలిజ సంఘం నేతలు రెడ్డి రాజు, సానబోయిన రామారావు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన గీత కులాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 7లో

- రాజమహేంద్రవరం సిటీ



ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

గీత కులాలకు కూటమి అధిక ప్రాధాన్యం

» మంత్రి వాసంశెట్టి సుభాష్ » రాజమహేంద్రవరంలో శెట్టిబలిజ వెన్నుదన్ను సభ » పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు



శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణం చేయిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం, పాల్గొన్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గీత కులాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అధిక ప్రాధాన్యమిచ్చారని కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. తూర్పు గోదావరి రాజమహేంద్రవరం లాలాచెరువులో శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, 15 మంది డైరెక్టర్ల ప్రమాణస్వీకారోత్సవం, శెట్టిబలిజ వెన్నుదన్ను సభ శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం (ఆర్‌ఎస్) అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగింది. కుడుపూడి సత్తిబాబు, 15మంది డైరెక్టర్‌లతో ఆర్‌ఎస్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శెట్టిబలిజ జాతి పిత దొమ్మేటి వెంకటరెడ్డి కాంస్య విగ్రహాన్ని రాజమహేంద్రవరం లాలాచెరువు సెంటర్‌లో ఆవిష్కరించడం చాలా ఆనందంగా ఉందని, వేమగిరి సెంటర్లో కూడా దొమ్మేటి విగ్రహాన్ని పెట్టుకుంటామన్నారు. గీత కులాలకు కూటమి ప్రభుత్వ సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 5నెలలోనే లిక్కర్ పాలసీలో 10శాతం రాయితీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం శెట్టిబలిజ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేస్తే చంద్రబాబు సీఎం అయ్యాక కార్పొరేషన్లను బలోపేతం చేసి నిధుల కేటాయింపులు చేస్తున్నారన్నారు. శెట్టిబలిజలను తెలంగాణలో ఓసీలుగా పరిగణిస్తున్న తరుణంలో తమ సీఎం చంద్రబాబు దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు.

శెట్టిబలిజల అభివృద్ధికి కృషి : దుర్గేష్

మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ శెట్టిబలిజల అభివృద్ధికి చైర్మన్, డైరెక్టర్లు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయంగా కొంతమందికి అవకాశాలు వస్తాయని, కుడుపూడి సత్తిబాబు, డైరెక్టర్లు జాతి ప్రయోజనం కోసం కృషి చేయాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అమరావతిని, పోలవరాన్ని చంద్రబాబు కచ్చితంగా పూర్తి చేస్తారని చెప్పారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఇటు పార్టీ కార్యక్రమాల్లో, అటు జాతి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ కుడుపూడి చేసిన కృషికి తగిన గుర్తింపు లభించిందన్నారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించి గీత కులాలకు అనాడే ఎన్టీఆర్ ప్రాధాన్యత ఇచ్చారని దానిని సీఎం చంద్రబాబు ముందుకు తీసుకెళ్లి మరింతగా అభివృద్ధికి పాటుపడ్డారని చెప్పారు. తెలంగాణ శెట్టిబలిజ సంఘం నేతలు జయప్రకాష్‌నారాయణ, కొప్పి శెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణలో ఓసీలుగా ఉన్న శెట్టిబలిజలను బీసీలుగా మార్పించడంలో కూటమి ప్రభుత్వం చొరవచూపి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందించారు. రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్పొరేషన్లకు నిధులు-విధులు లేకుండా నిర్వీర్యం చేస్తే చంద్రబాబు తగిన ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ శెట్టిబలిజ గౌడ, శ్రీశ యన, యాత కులాల అభివృద్ధికి పాటుపడింది టీడీపీయే అని గుర్తు చేశారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను గజమాలతో శెట్టిబలిజ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సభలో టీడీపీ నేతలు యర్రా వేణుగోపాలరాయుడు, పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ బుడ్డిగ రవి, కడలి రామకృష్ణ, పిల్లి శ్యామ్, సింహా నాగమణి తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న శెట్టిబలిజలు

వేట్లపాలెం... రక్తసిక్తం



ముగ్గురి హత్యకు దారి తీసిన ఇల్లు

» ముగ్గురు మృతి.. ఏడుగురికి తీవ్ర గాయాలు
» ఇంటి సరిహద్దు విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం
» కత్తులు, గొడ్డళ్లతో ఒక వర్గంపై మరొక వర్గం దాడి
» సామర్లకోట మండలం వేట్లపాలెం శివారులో ఘటన

సామర్లకోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం సరిహద్దు వివాదంలో ఇరు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలు ముగ్గురు వ్యక్తుల దారుణ హత్యకు దారి తీసింది. మరో ఏడుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక ఇంటి నిర్మాణం వద్ద జరిగింది. ఘర్షణలకు దారి తీసిన ఇరువర్గాలూ ఒకే సామాజిక వర్గానికి చెందిన దళితులు కావడం గమనార్హం. గ్రామ శివారులో దళిత చెరువును ఆక్రమించి కార్దాల కుటుంబానికి చెందిన వ్యక్తులు ఇల్లు నిర్మిస్తున్నారని సమీపంలోనే ఉంటున్న బచ్చల కుటుంబానికి చెందిన వారు గ్రామ పంచాయతీలో ఫిర్యాదులు చేశారు. ఈ వివాదం ఆ 2 కుటుంబాల మధ్య 3నెలలుగా నడుస్తోంది. గ్రామ పెద్దల మధ్య కూడా పలు దఫాలు చర్చలు నిర్వహించారు. అయితే కార్దాల కుటుంబానికి చెందిన వ్యక్తులు ఆదివారం ఇంటి నిర్మాణంలో భాగంగా సుమారు 15మంది కూలీలతో కలిసి శ్లాబ్ వేస్తుండగా ఇదే అదనుగా చూసుకుని బచ్చల కుటుంబానికి చెందిన వ్యక్తులు సుమారు పది మంది మూకుమ్మడిగా కత్తులు, ఇనుపరాడ్‌లతో ఒక్కసారిగా దాడులు చేసి విచక్షణ రహితంగా నరికారు. దీంతో కార్దాల ప్రకాశరావు(55) సంఘటనా స్థలిలోనే తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన వారిని ప్రైవేట్ అంబులెన్స్‌లో సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కార్దాల చంద్రరావు(60) మృతిచెందాడు. ఉన్నత చికిత్స నిమిత్తం మిగిలిన వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ కార్దాల ఏసుబాబు(45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో కార్దాల పండు, కార్దాల దావీదు, కార్దాల బాబీ, కార్దాల చిన్నోడు, కార్దాల సత్యవేణి, కార్దాల అచ్చియ్య, కార్దాల సంజీవరావులు ఉన్నారు. వారిలో ఒకరి పరిస్థితి విషయంగా ఉన్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి వర్గాల ద్వారా సామర్ల కోట పోలీసులకు తెలిసింది.

కాగా ఈ దాడులకు పాల్పడిన వారిగా బచ్చల సుబ్బారావు, బచ్చల జకరయ్య, బచ్చల బిక్షప్పి, బచ్చల మోషే, బచ్చల భాగ్యవతిలను పోలీసులు ప్రాథమికంగా గుర్తించి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటనా సమాచారం అందిన వెంటనే పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ శ్రీ కృష్ణభగవాన్ తదితర పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థలికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేరుకుని ఘర్షణలకు దారి తీసిన పరిస్థితులపై, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి గురించి ఆరా తీశారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.



సంఘటనా స్థలంలో మృతిచెందిన ప్రకాశరావు

పోలీసుల విఫలం!

ఇదిలా ఉండగా 2 కుటుంబాల మధ్య వివాదం గత 3 నెలలుగా పంచాయతీలో ఫిర్యాదులు పరంపరగా నడుస్తుండడం, గ్రామ పెద్దల మధ్య రాజీ చర్చలు నిర్వహించడం వంటి కీలక సమాచారాన్ని సేకరించడంలో పోలీసు వర్గాలే కాదు ఇంటిలిజెన్స్ వర్గాలు సైతం విఫలం కావడం వల్లే రెండు కుటుంబాల మధ్య కత్తులతో దాడులు, ముగ్గురి హత్యకు దారితీసిందని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో 2018లో ఇదే ప్రాంతంలో దళితులకు, దళితులేతరులకు పట్టాలుగా దళిత చెరువులో అప్పట్లో వివాదం చెలరేగి 15 ఇళ్లు తగులబెట్టిన విషయం విధితమే.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పండు, సంజీవరావు



కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి ప్రమాణ స్వీకారంలో ప్రసంగిస్తున్న మంత్రి దుర్గేష్

కౌడా చైర్మన్ తుమ్మల ప్రమాణ స్వీకారం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డవలెప్‌మెంట్ అథారిటీ (కౌడా) చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం కాకినాడలోని ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి కం దుల దుర్గేష్ మాట్లాడుతూ కాకినాడ పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కౌడా నిధులతో మరింత అభివృద్ధి చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. రామస్వామి సేవలకు గుర్తింపుగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతిష్టాత్మక కౌడా చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించారన్నారు. రామస్వామి మాట్లాడుతూ కౌడా నిధులతో బీచ్‌లో ఏర్పాటు చేసిన యుద్ధ విమాన మ్యూజియాన్ని జనవరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యా

ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్

ణ్‌తో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కౌడా పరిధిలోని ప్రాంతాల అభివృద్ధి కి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో చైర్మన్ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు య నమల రామకృష్ణుడు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, వనమాడి కొండబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ హరిప్రసాద్, టీడీపీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు జ్యోతులనవీన్, చిలుకూరి రామ్‌కుమార్, డిడ్కో చైర్మన్ వి.అజయ్, సివిల్ సరఫరా చైర్మన్ తోట సుధీర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెట్టు మెట్టుకు పూజలు

● సత్యదేవుడి సన్నిధిలో వేడుకగా మెట్లోత్సవం
● పసుపు, కుంకుమలు పూసేందుకు తరలివచ్చిన మహిళలు





సత్యదేవుని సన్నిధిలో పోటాపోటీగా మెట్లకు పసుపు, కుంకుమలు పూస్తున్న మహిళలు, పల్లకీలో పూజలందుకున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం మెట్లోత్సవ కార్యక్రమం అత్యంత వేడుకగా జరిగింది. ఉదయం 7 గంటలకు కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను పల్లకీలో కొండదిగువకు తీసుకునివచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. 9.30కి తొలిపావంచా వద్ద పల్లకీలో స్వామి,అమ్మవార్లకు ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం స్వామివారి అష్టోత్తరశతనామాలతో పూజలు నిర్వహించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం తొలిమెట్టు వద్ద ఈవో సుబ్బారావు హారతులివ్వగా మహిళలు పసుపు, కుంకుమలతో మెట్టు మెట్టుకు పూశారు. ముందు పల్లకీలో స్వామిఅమ్మవార్లను మేళతాలాలతో తీసుకెళ్లగా పల్లకీ వెంట మహిళలు హారతులు వెలిగించి పటికబెల్లం నివేదన చేసుకుంటూ ప్రధానాలయానికి చేరుకున్నారు. పీఆర్వో కొండలరావు, సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు పాల్గొన్నారు. అలాగే రత్నగిరిపై వారాంతపు ఆర్జిత సేవయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది.

భక్తులతో కిక్కిరిసిన రత్నగిరి

సత్యదేవుడి సన్నిధి ఆదివారం పౌర్ణమి పర్వదినం కావడంతో భక్తులతో కిక్కిరిసింది. సెలవు, పౌర్ణమి పర్వదినం, శనివారం రాత్రి రత్నగిరిపై వివాహమాచరించుకున్న జంటలు, వివిధ ప్రాంతాల్లో పెళ్లైన నూతన జంటలతో రద్దీ ఏర్ప డింది. సుమారు 3వేల వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.40 లక్షల ఆదాయం లభించింది.

ఆలయ సిబ్బందితో నూతన ఈవో సమీక్ష సమావేశం

అన్నవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా శనివారం బాధ్యతలు స్వీకరించిన వీర్ల సుబ్బారావు ఆదివారం సాయంత్రం దేవస్థానం అన్ని విభాగాల ఏఈవోలు, సూపరెంటెండెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది పరిచయ కార్య క్రమం అనంతరం దేవస్థానంలో విభాగాల వారీగా రివ్యూ నిర్వహించారు. ఆలయాల అభివృద్ధికి భక్తులే మూలమని, భక్తులకు ఏవిధంగా మరింత మెరుగైన సేవలు అందించగలం, కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉదయమే 5గంటలకు అకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టారు. సన్నిధి బుకింగ్ కౌంటర్, కమాండ్ కంట్రోల్ రూంలను పరిశీలించారు. సెక్యూరిటీ వ్యవస్థపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

పృచ్ఛకుల ప్రశ్నలు.. చమత్కారంగా సమాధానాలు..

పిఠాపురంలో భగవద్గీతపై అష్టావధానం



అష్టావధానంలో ప్రశ్నలకు సమాధానాలిస్తున్న అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు

పిఠాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పృచ్ఛకులు సంధించే ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ, మధ్యలో అసందర్భ ప్రశ్నకలకు చిరునవ్వుతో చమత్కారంగా స్పందిస్తూ భగవద్గీతలోని అంశాలను వివరిస్తూ చేసిన అష్టావధానం ఆసక్తికరంగా సాగింది. కాకినాడ జిల్లా పిఠాపురం శివారులోని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు నిర్వహించిన భగవద్గీత అష్టావధానం ఆకట్టుకుంది. పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అధ్యక్షతన జరిగిన ఈ అవధానానికి గురు సహస్రావధాని డాక్టర్ గరిమెళ్ల వరప్రసాద్ సంచాలకులుగా వ్యవహరించారు. పృచ్ఛకులు లింగాల యాజ్ఞవల్క్య శర్మ, జోస్యుల కృష్ణబాబు, అష్టావధాని కాకరపర్తి దుర్గాప్రసాద్, మార్ని జానకిరామచౌదరి, దాయన సురేష్‌చంద్రజీ, శతావధాని పోచినపెద్ది సుబ్రహ్మణ్యం, డాక్టర్ వేదుల శ్రీరామశర్మ, సూరంపూడి వెంకటరమణలు వ్యవహరించారు. సుమారు 6గంటల పాటు అష్టావధానం సాగింది.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

అష్టావధానం జరిగిన వేదికపై పురాతన ఆగమశాస్త్ర పద్ధతుల్లో నిర్వహించిన ఆలయ దర్శనం నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ప్రముఖ నాట్యాచారుడు సప్పాదుర్గాప్రసాద్ మార్గదర్శకత్వంలో నటరాజ నృత్యనికేతన్ కళాకారుల ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. పలువురు కవులను, నృత్యప్రదర్శన ఇచ్చిన కళాకారులను డాక్టర్ ఉమర్‌ఆలీషా సత్కరించారు. కార్యక్రమంలో పీఠం ప్రతినిధులు ఆకుల రవితేజ, ఏవీవీ సత్యనారాయణ, ఎన్‌టీవీ ప్రసాదవర్మ, పింగళి ఆనంద్ తదితరులున్నారు.

పాపికొండలకు 18 బోట్లలో పర్యాటకులు



పాపికొండలకు పర్యాటకులతో వెళ్తున్న బోట్లు

వీఆర్‌పురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) పాపికొండలు, పేరంటాలపల్లి విహారయాత్రకు పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు పేరంటాలపల్లి, పాపికొండల్లోని ప్రకృతి అందాలను తిలకించేందుకు 18 పర్యాటక బోట్లపై దాదాపుగా 1200 వందల మంది విహారయాత్రకు వెళ్లారు. గోదావరి నది ఒడ్డున ఉన్న ప్రకృతి అందాలను, పాపికొండల అందాలను పర్యాటకులు ఆస్వాదించారు. పేరంటాలపల్లిలోని మునిమఠం (శివాలయం) పర్యాటకులతో కళకళలాడింది. కొండరెడ గ్రా మంలో పండుగ వాతావరణం కనిపించింది. గోదావరి నదిలో 18బోట్లు ఒకేసారి విహారయాత్రకు వెళ్లడంతో పర్యాట కులు ఆనందంగా విహార యాత్ర సాగించి సాయంత్రానికి వెనుతిరి గారు.

విహారయాత్రకు బ్రేక్.. మళ్లీ అనుమతులు

రంపచోడవరం/దేవీపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టు పర్యటన జరగనుండడంతో పాపికొండలు విహారయాత్రకు వెళ్లే పర్యాటక బోట్లను ఆదివారం నిలిపివేశారు. కాగా, సోమవారం కూడా నిలుపుదల చేసినట్టు అధికారులు ముందు ప్రకటించారు. కానీ ఈనెల 16నుంచి పర్యాటక బోట్లకు పూర్తి అనుమతులు ఉన్నవారు యథావిధిగా నిర్వహించుకోవచ్చని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి ఆమె మాట్లాడుతూ సీఎం పర్యటన పోలవరంలో ఉన్నందున అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైసెన్స్ (ముందు జాగ్రత్తచర్యగా) దేవీపట్నంలోని గోదావరి పర్యాటక బోట్లను నిలుపుదల చేశామన్నారు. ఈనెల 16 నుంచి పర్యాటక బోట్లకు సంబంధించిన ప్రభుత్వ అనుమతులు ఉన్నవారు యథావిధిగా నడపవచ్చని, పర్యాటక బోట్లకు పర్యాటకుల భద్రతకు లైఫ్ జాకెట్లు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు.

తండ్రిని చంపి... బంధువులకు చెప్పి!

పెంపుడు కొడుకు చేతిలో హత్యకు గురైన తండ్రి, ఆస్తి పంచాలని గొడవ



హత్యకు గురైన వీరవెంకటనరసింహారావు



హత్య చేసిన రాంబాబు

అంతర్వేది, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కొడుకు చేతిలో తండ్రి హత్యకు గురైన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. కొడుకు రాంబాబు చేతిలో తండ్రి రావి వీరవెంకటనరసింహారావు (75) హత్యకు గురయ్యాడని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో రాంబాబు అనే వ్యక్తి రోజూ ఆస్తి పంచాలని పెంపుడు తల్లిదండ్రులతో గొడవ పడుతూ ఉండేవాడు. అతడి మానసిక స్థితి కూడా సరిగా లేకపోవడంతో శనివారం రాత్రి జరిగిన గొడవలో ప్లాస్టిక్ కుర్చీతో తండ్రి వీరవెంకట నరసింహారావు తలపై కొట్టడంతో చెవి, ముక్కులో నుంచి రక్తం వచ్చింది పడిపోయాడు. అతడి భార్య ఈ గొడవ చూడలేక పక్కింటికి వెళ్లిపోవడంతో వీరవెంకటనరసింహారావును కాపాడేవారు లేకపోవడంతో మృతిచెందాడు. తండ్రిపై హత్యాయత్నానికి పాల్పడిన రాంబాబు బంధువులను పిలిచి విషయం చెప్పడం కూడా ఆశ్చర్యానికి గురిచేసింది. ఆదివారం ఉదయం పోలీసులు, క్లూస్ టీమ్ వచ్చి వీరవెంకటనరసింహారావు మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించారు. అనంతరం రాంబాబును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. పిల్లలు లేకపోవడంతో వీరవెంకటనరసింహారావు రాంబాబును దత్తత తీసుకున్నాడు. సుమారు 40 ఏళ్లు పెంచి పోషించిన విశ్వాసం కూడా లేకుండా రాంబాబు తండ్రిని హత్య చేయడంతో బంధువులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.

శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్‌లో కొనసాగిన ఐటీ దాడులు

పెద్దాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో ఆదాయపన్ను శాఖ (ఇన్‌కంట్యాక్స్) అధికారుల దాడులు ఆదివారం కొనసాగాయి. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్ ఇళ్లతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి బంధువుల ఇళ్లలో మూడోరోజు ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. ఇప్పటికే సంస్థకు సంబంధించిన పలు కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. అలాగే ఐటీ దాడులు సమయంలో లక్షిత వ్యక్తులకు సన్నిహితులైన కొంతమంది అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. ఆదివారం వారిని సైతం ఐటీ అధికా రులు గుర్తించి మరింత సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. వాలుతిమ్మాపురం, వడ్లమూరు వెళ్లే రహదారిలో ఉన్న శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ పరిశ్రమల్లో పలు రికార్డులను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

పుష్కర కాలువలో మృతదేహం లభ్యం

గండేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి మృతదేహం పుష్కర కాలువలో లభ్యమైంది. కాకినాడ జిల్లా గండేపల్లి పోలీసుల వివరాల ప్రకారం... గండేపల్లి మండలం ఉప్పలపాడుకు చెందిన లక్కాకుకల వెంకటేశ్వరరావు(59) ఈనెల 12న ఉదయం బహిర్భూమికి వెళ్తొస్తానని చెప్పి తిరిగి రాలేదు. అయితే ఆదివారం ఉదయం తాళ్ళూరు గ్రామంలో పామాయిల్‌తోట పక్కన పుష్కర కాలువలో వెంకటేశ్వరరావు మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. కేసు నమోదు చేశారు.



వెంకటేశ్వరరావు మృతదేహం

సచివాలయంలో మద్యం బాటిళ్లు

ఇద్దరు వీఆర్వోల నిర్వాకం

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్యం బాటిళ్ల బ్యాగ్‌లో పెట్టుకుని సచివాలయానికి తీసుకెళ్లిన ఘటన సంఘటన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ గ్రామసచివాలయంలో జరిగింది. ఇద్దరు వీఆర్వోలు వారి క్యాబిన్‌లో మద్యం బాటిళ్లు కలిగి ఉన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి వెళ్లి తనిఖీ చేయగా వాటిని రైతులు తెచ్చారని బుకాయించే ప్రయత్నం చేశారు. రైతులే మద్యం బాటిళ్లు తెచ్చి ఉంటే వారికి ఏ పని చేయడానికి వీఆర్వోలు మద్యం బాటిళ్లు లంచంగా తెప్పించుకున్నారో వారికే తెలియాలి. బాధ్యత గల వీఆర్వోలు మద్యం బాటిళ్లు కలిగి అది కూడా సచివాయలంలో ఉండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ విషయం తెలిసి తహశీల్దార్ వివరణ అడిగినట్టు తెలిసింది. వీఆర్వోలపై కలెక్టర్ ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



మద్యం బాటిళ్లతో ఉన్న బ్యాగ్‌ను లాగుతున్న సిబ్బంది

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

పిఠాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు జరిగాయి. చూపిన ప్రతిభ ఆధారంగా ఏడుగురు క్రీడాకారులను రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేశారు. పిఠాపురంలో ఈనెల 19,20వ తేదిల్లో రాష్ట్రస్థాయి పురుషుల బాక్సింగ్ పోటీల్లో వారు కాకినాడ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. 55కిలోల విభాగంలో జె.నందకిషోర్(తుని), 60కిలోల విభాగంలో ఆర్.దుర్గాఅప్పలరాజు(తుని), 65కిలోల్లో పి.ధనుష్(కాకినాడ), 70కిలోల్లో బి.చిన్ని(తుని), 75కిలోల విభాగంలో జి.శివప్రసాద్(మాధవపురం), 80 కిలోల్లో కె.కిషోర్(తొండంగి), 85కిలోల విభాగంలో పీడీఎస్ శివ(అన్నవరం) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ పోటీలను రగ్బీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ వియ్యపు రామన్నరాజు, అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కేతవరపు కృష్ణ, సోము గోవిందరాజులు ప్రారంభించారు.

అమ్మో పులి!

పులిని చూసి ఆస్పత్రిపాలైన వ్యక్తి

రాజవొమ్మంగి డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పులి సంచారం ఇక్కడి ప్రజలకు శాపంగా మారిందనే చెప్పాలి. ఈ నెల 2న రాజవొమ్మంగి మండలంలో పులి సంచారంతో ప్రజలు భయపడిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం రాత్రి పులిని చూసి ఓ వ్యక్తి ఆస్పత్రి పాలయ్యాడు. అడ్డతీగల మండలం కినపర్తి గ్రామానికి చెందిన తొంట చిన్నబాబు శనివారం సాయంత్రం పొలానికి వెళ్తూ మార్గమధ్యలో పులిని చూసి బెంబేలెత్తిపోయాడు. భయంతో పొలానికి వెళ్లగా అతడి భార్య చిన్నబాబుకు సపర్యలు చేయగా తిరిగి ఇంటికి వస్తుండగా దూరంగా పెద్దగా శబ్దం రావడంతో స్పృహ కోల్పోయి అడ్డతీగల ప్రభుత్వానుపత్రిలో చేరాడని గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనపై అటవీశాఖ సిబ్బంది శనివారం, ఆదివారం వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారని, పులి పాదముద్రలు దొరకలేదు. కానీ మరో వ్యక్తి కూడా పులిని చూసినట్టు చెపుతున్నారని ఎఫ్‌ఎస్‌వో అర్జునుడు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ఒకే రోడ్డు.. మూడుచోట్ల స్నాచింగ్

రాజమహేంద్రవరంలో వరుస చోరీలు

భయాందోళన చెందుతున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో గొలుసు దొంగతనాలు వరుసగా జరుగుతున్నాయి. దీంతో బయటకు రాడవడానికి మహిళలు భయాందోళన చెందుతున్నారు. పది రోజుల క్రితం మల్లయ్యపేటలో ఒక మహిళ రోడ్డుపై నడిచి వెళ్తుంటే గుర్తు తెలియని దొంగలు బైక్‌పై వచ్చి బంగారు అభరణాలు లాక్కునిపోయారు. శనివారం సీతంపేటకు చెందిన ఒక మహిళ తన తండ్రితో కలిసి బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు హెల్మెట్ పెట్టుకుని వచ్చి మహిళ మెడలో గొలుసు లాక్కొనే ప్రయత్నం చేశారు. ఆ మహిళ గొలుసు గట్టిగా పట్టుకోవడంతో బైక్‌ను తోసేసి పరారయ్యారు. దీంతో వారు కిందపడిపోయారు. దొంగలు మాత్రం తప్పించుకుని పోయారు. క్వారీ సెంటర్ ప్రాంతానికి చెందిన పి.వెంకటలక్ష్మి ఆదివారం ఉదయం 10గంటలకు ఆటో ఎక్కి కోటిపల్లి బస్టాండ్ వద్ద దిగి జోడుగుళ్ళకు నడిచి వెళ్తుండగా ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో నల్లపూసలు తాడును లాగారు. ఆమె ఆభరణాలను గట్టిగా పట్టుకోవడంతో సగం తెగిపోయి దొంగల చేతిలోకి వెళ్ళిపోయింది. సుమారు 10 గ్రాముల బంగారం పోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గాంధీపురానికి చెందిన పి.సత్యసుజాత క్వారీ వద్ద ఉన్న చేపల మార్కెట్‌కు బయల్దేరింది. మార్గమధ్యంలో క్వారీసెంటర్-లాలాచెరువు రోడ్డులో ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని సుమారు 5కాసులు బంగారు ఆభరణాలు లాక్కునిపోయారు. దీంతో బాధితురాలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పేపరు మిల్లు రోడ్డులో పి.వరలక్ష్మి నడిచి వెళ్తుండగా ఇద్దరు దొంగలు బైక్‌పై వచ్చి ఎటాక్ చేసి మెడలో రెండున్నర కాసులు బంగారు ఆభరణాలను లాక్కుపోయారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ మూడు ఘటనలు ఆదివారం జరిగాయి. అదికూడా గంటన్నర గ్యాప్‌లోనే. పోలీస్ గస్తీని పెంచి నిఘా పెట్టకపోతే చెయిన్ స్నాచింగ్‌లు మరింతగా పెరుగుతాయని మహిళలు చెప్తున్నారు.

‘సప్తపది’ ఆవిష్కరణ


సప్తపది చరవాణి పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ వివాహ సమాచారం త్వరితగతిన అందుకునేందుకు ‘సప్తపది’ చరవాణి పత్రిక ఎంతగానో ఉపయోగపడుతుందని బ్రాహ్మణ సీనియర్ నాయకుడు అజ్జరపు హరిబాబు అన్నారు. రాజమహేంద్రవరం బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం సీతంపేటలో బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను మాదిరాజు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ‘సప్తపది’ చరవాణి పత్రికను హరిబాబు ఆవిష్కరించారు. బ్రాహ్మణుల్లో వివాహాలను తగిన సమయంలో జరిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ నాయకుడు వైవీ జగన్నాథరావు సూచించారు. వివాహ సమాచార వేదిక సమన్వయకర్తగా అయ్యగారి రామ్మూర్తి వ్యవహరించారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దుర్వాసుల సత్యనారాయణ, గుడిపూడి సునీల్ గౌతమ్, ఆరాధ్యుల సాయి, కలగ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై వినతులు అందజేయండి

జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి సందీప్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డు కులాల్లోని ఉప వర్గీకరణపై విచారణ చేయడానికి రిటైర్డు ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. ఈ కార్యాలయాన్ని విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేశారు. రిప్రజెంటేషన్లు, మెమోరాండాలను కార్యాలయ పనివేళల్లో వ్యక్తిగతంగా, తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్ పోస్టు ద్వారా, ఈ-మెయిల్ ద్వారా జనవరి 9వ తేదీలోగా సమర్పించవచ్చు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి సందీప్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 400 మందికి వైద్య సేవలందజేశామని, రోగులు వారి సహాయకులకు అన్నదానం నిర్వహించామని రామకృష్ణ మిషన్ మేనేజర్ స్వామి రఘువీరనంద తెలిపారు. డాక్టర్లు జీవీ రామారావు, కస్తూరి సుబ్రహ్మణ్యం, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్‌కుమార్, జీఎస్ఎల్ వైద్యులు సేవలు అందించారు. వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రిచే కంటి వైద్య శిబిరం నిర్వహించారు. క్యాంపు కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జమీందారీ మెట్ట వద్ద వేంకటేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం నుంచి వచ్చే నెల 13 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్తలు శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం-మీనాక్షి దంపతులు తెలిపారు. ప్రతిరోజూ సుప్రభాత సేవ, అర్చన, తిరుప్పావై సేవాకాలం, మంగళాశాసనం జరుగుతాయని వివరించారు.

శ్రీరాములు త్యాగనిరతి ఆదర్శప్రాయం


సీతానగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు
- ‘అమరజీవి’ వర్ధంతి
- నివాళులర్పించిన నాయకులు, అధికారులు
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు, సీతానగరంలో బైక్ ర్యాలీ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష మాట్లాడేవారి కోసం ప్రత్యేక రాష్ట్రం సాధించిన పొట్టి శ్రీరాములు త్యాగనిరతి, పట్టుదల అందరికీ ఆదర్శమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాము లు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటానికి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. సూపరింటెండెంట్ కేవీ సత్యనారాయణ, స్టాలిన్, డాక్టర్ మౌనిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ప్రకాష్‌నగర్‌లోని జక్కంపూడి రాజా నివాసంలో జరిగిన కార్యక్రమంలో అమరజీవి చిత్రపటానికి వైసీపీ నాయకులు నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ తెలుగు ప్రజలు సగర్వంగా తలెత్తుకుని జీవిస్తున్నారంటే దానికి కారణం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగనిరతి అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, నాయకులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కార్యదర్శి గ్రంధి రాజా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా ప్రకటించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అలాగే పొట్టి శ్రీరాములుకు భారతరత్న బిరుదు అందజేసేలా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కృషి చేయాలని ఆర్యవైశ్య సంఘం తరపున విజ్ఞప్తి చేస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు గ్రంధి నానబ్బులు, దవులూరి గిరిబాబు, ముత్తా రామకృష్ణ, బలభద్ర ప్రసాద్, కంకటాల మహేష్, పాలూరి ఏడుకొండలు, గ్రంధి సత్తిబాబు పాల్గొన్నారు.

కడియం: కడియంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి కాంగ్రెస్ రూరల్ కోఆర్డినేటర్ తాడాల కొండ్రాజు పూలమాలలతో నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆత్మార్పణం చేసుకున్న శ్రీరాములు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పీఎస్ రాజు, యాళ్ల వీరభద్రరావు, ఉలిశెట్టి సత్తిబాబు, రత్నం వెంకట్రావు, నాగిరెడ్డి వెంకటేష్ పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముందుగా పొట్టి శ్రీరాములు ఆయన చిత్రపటానికి హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1952 వరకూ మన రాష్ట్రం, తమిళనాడుతో కలిపి ఉమ్మడి మద్రాస్ ప్రెసిడెన్సీలో భాగంగా వుండేదని అయితే పొట్టి శ్రీరాములు 56 రోజుల ఆమరణ దీక్ష చేసి ప్రాణ త్యాగం చేయడంతో 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొవ్వూరి విజయగీత, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరం: ఆర్యవైశ్య మండల సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. రఘుదేవపురం నుంచి సీతానగరం బస్టాండ్ సెంటర్, నాలుగు బొమ్మల సెంటర్ మీదుగా వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు బైక్ ర్యాలీ చేశారు. అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలభిషేకం చేసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పువ్వాడ కృష్ణ మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహంలోను పాల్గొని జైలుపాలయిన స్వాతంత్ర్య సమరయోధుడు పొట్టి శ్రీరాములు అన్నారు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు తన ప్రాణాలు సైతం ధారబోసిన ఆయనకు భారతరత్న అవార్డు ఇచ్చే విధంగా కూటమి ప్రభుత్వం కేంద్ర దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, టీడీపీ నాయకుడు పెందుర్తి అభిరామ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.


ఊలపల్లి హైస్కూల్లో శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

రైతు సంక్షేమంలో నీటి సంఘాలు కీలకం


నీటి సంఘాలకు ఎన్నికైన వారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతాంగం సంక్షేమంలో సాగునీటి సంఘాలు కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం పార్టీ కార్యాలయంలో ఆదివారం తనను కలిసిన నీటి సంఘాల కార్యవర్గాలకు ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రైతాంగ అభివృద్ధికి సాగునీటి సంఘాలు సమష్టిగా కృషి చేయాలన్నారు. రైతుల అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని, నియోజకవర్గంలో చాగల్నాడు ఎత్తిపోతల పథకం ప్రతిష్టాత్మకమైనదని, వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించడంలో కీలకంగా మారిందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్, పుష్కర నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, పాలకవర్గాలను ఎమ్మెల్యే అభినందించారు.

రైతుల సంక్షేమానికి పాటుపడాలి

అనపర్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి నీటి సంఘాల ప్రతినిధులుగా పాటుపడాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలో నీటి సంఘాలకు ఎన్నికైన పలువురు అధ్యక్ష ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు రామవరంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వాటిని తొలగించి సకాలంలో సాగునీరందే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అనపర్తి, కొమరిపాలెం, కొంకుదురు, దొడ్డిగుంట, రామవరం, పులగుర్త, రంగంపేట, పొలమూరు నీటి సంఘాల అధ్యక్షులు తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, కొమ్మన రాంబాబు, కర్రి సత్యనారాయణరెడ్డి, గొడితి వెంకటకృష్ణారావు, జీవీవీ శ్రీనివాసరావు, చిర్ల ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నల్లమిల్లిని సత్కరిస్తున్న పలు నీటి సంఘాల అధ్యక్షులు

సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అరాచకాలు

మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి ఆరోపణ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అరాచకాలకు పాల్పడిందని, ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధంగా వ్యవహరించిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆరోపించారు. ఆదివారం రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొన్నిచోట్ల దాడులు, మరికొన్నిచోట్ల దౌర్జన్యం, ఇంకొన్నిచోట్ల ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు చెందిన నామినేషన్ల చించివేత వంటి చర్యలకు పాల్పడ్డారన్నారు. గడచిన ఆర్నెలల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయలేదని, దీంతో వ్యతిరేకత పెరిగిందని, అందుకే ఏకగ్రీవం పేరుతో విపక్ష పార్టీలను నామినేషన్లు వేయకుండా చేశారన్నారు.

నేటి నుంచే ధనుర్మాస మహోత్సవం ప్రారంభం

● 16న ఉదయం 6-57కు నెలగంట

దివాన్‌చెరువు, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని డీబీ రాజు టౌన్‌షిప్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ అర్చకుడు ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం గం.6-57 ని.లకు ఆలయంలో నెలపడతారన్నారు. గోదాదేవి అభిషేకం నూతనవస్త్రాల అలంకరణతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని చెప్పారు. భోగి పండుగ వరకూ 30 రోజులు గోదాదేవికి స్వామివారికి పూజలు నిర్వహిస్తారన్నారు.భోగి పర్వదినాన్న గోదాదేవికళ్యాణంతో ధనుర్మాస మహోత్సవాలు ముగుస్తాయని చెప్పారు. ఈఉత్సవాలలో భాగంగా విష్ణుమూర్తికి తులసీదళాలతో సహస్రనామార్చన చేస్తామని తెలిపారు. విష్ణుమూర్తికి ప్రీతికరమైన మాసంగా భావించే ధనుర్మాసంలో రోజూ తిరుప్పావై పాశురాలును పారాయణం చేస్తారని అన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా విల్సన్‌పాల్



కడియం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కడియం వైద్య ఉద్యోగి సీహెచ్ విల్సన్‌పాల్ ఎన్నికయ్యారు. ఈనెల 14న రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్‌లో జరిగిన ఉద్యోగుల మహాసభలో జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా పి.గిరిప్రసాద్‌వర్మ, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ విల్సన్‌పాల్ ఎన్నికయ్యారు. వీరితో పాటు కడియం సీహెచ్‌సీ ఉద్యోగి పి. రవికుమార్, కడియం సచివాలయ ఉద్యోగి కె.సూర్యశ్రీనివాస్‌లు ఉపాధ్యక్షులుగా, కడియం గ్రేడ్-1 కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, మురమండ సచివాలయ ఏఎన్ఎం టి.మణిశ్రీ జాయింట్ సెక్రటరీలుగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

అగ్నిప్రమాద బాధితుడిని ఆదుకుంటాం

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 11వ డివిజన్ వీఎల్ పురం స్కూలు వీధిలో టైలరింగ్ షాపు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. టైలర్ మల్లిబాబును ఆదివారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు వున్నారు.

భక్తిశ్రద్ధలతో పున్నమి గిరి ప్రదక్షిణ


లక్ష్మీనరసింహస్వామి కొండచుట్టూ పున్నమి గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కోరుకొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ స్వయంభు శ్రీ నరసింహ స్వామివారి కొండ చుట్టూ పున్నమి సందర్భంగా ఆదివారం సాయంత్రం కోరుకొండ పరిసర గ్రామాలకు చెందిన అనేక మంది భక్తులు గిరిప్రదక్షణ నిర్వహించారు. అధ్యాపక స్వామి మార్టపురి రాంబాబు ఆధ్వర్యంలో స్వామివారి దిగువదేవస్థానం నుంచి లక్ష్మీనరసింహస్వామివారి చిత్రపటాన్ని చేత పట్టుకుని ఓం శ్రీ లక్ష్మీనరసింహాయనమః అంటూ ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి ప్రారంభమై వినాయక గుడి మీదుగా దేవుని కోనేరు, అభయ ఆంజనేయస్వామి వారి ఆలయం మీదుగా కొండచుట్టూ గిరి ప్రదక్షణ భక్తిశ్రద్ధలతో సాగింది. అనంతరం లక్ష్మీనరసింహ స్వామివారి పాదాలవద్ద పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని సేవాకాలం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో కోరుకొండ, కాపవరం, పశ్చిమగోనగూడెం, జంబుపట్నం, శ్రీరంగపట్నం గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మ తీర్థానికి చురుగ్గా ఏర్పాట్లు


జాతీయ రహదారిపై ముస్తాబవుతున్న దుర్గమ్మ ఆలయం

రాజానగరం, డిసెంబరు 15 : మండలంలో చక్రద్వారబంధం-సూర్యారావుపేట గ్రామ పొలిమేరల్లో 16వ నెంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న శ్రీకనకదుర్గమ్మ 44వ తీర్థ మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపా లతో అలంకరించారు. ఉత్సవాలను పురస్కరించుకుని జాతీయ రహదారిపై వాహనాల రాకపోక లతో భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఉండేలా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతు న్నారు. రాత్రి సమయంలో మిరుమిట్లు గొలిపే బాణా సంచాకాల్పులతో పాటుగా పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అమ్మవారి తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి సమయానికి మురారి దుర్గమ్మను దర్శిం చుకుని తిరుగు పయనమయ్యే భక్తులు ఇక్కడకు చేరుకోవడంతో రద్దీ నెలకొంటుంది.

రంగాపురంలో 15 కోడి పుంజులు చోరీ

బిక్కవోలు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రంగాపురంలో ఈనెల లో 15 కోడి పుంజులు, ఒక కోడి పెట్ట చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన కొమారపు ఆనందరావు శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లోంచి బయటకు రాగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు తన ఇంటివద్ద నుంచి పరుగులు తీయడంతో ఉదయం పరిశీలించగా తాను పెంచుకుంటున్న రెండు కోడిపుంజులు చోరీకి గురైనట్టు తెల్సిందన్నారు. దీంతో ఆదివారం గ్రామంలో ఆరా తీయగా ఈనెల 1న కనుమూరి సాయిరాజు ఇంట్లో 4 కోడి పుంజులు, ఒక పెట్ట, 3న తనుకు దుర్గాప్రసాద్ ఇంట్లో 3 కోడిపుంజులు, నీలపాల రామకృష్ణ ఇంట్లో 4 కోడిపుంజులు, 16న తుంపాల శ్రీనివాస్‌కు ఇంట్లోని రెండు కోడి పుంజులు చోరీకి గురయ్యాయని వారు తెలపడంతో ఆది వారం తాను కోడి పుంజుల దొంగతనాలపై దర్యాప్తు జరిపి నిందితులను శిక్షించాలంటూ ఫిర్యాదు చేశానని ఆనందరావు తెలిపారు. దీంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు.

నేడు స్టేట్ ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ పర్యటన

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు వదిత్య శంకర్ నాయక్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారంరాత్రి రాజమహేంద్రవరం చేరుకున్న ఆయన ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో బస చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు బొమ్మూరులోని ఏజీహెచ్ఎస్ పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో భేటీ అవుతారు. 11 గంటలకు కడియం మండలం వేమగిరి చేరుకుని షెడ్యూల్ తెగల ప్రజలతో ముఖాముఖి సమావేశం అవుతారని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కే ఎస్ జ్యోతి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు కొవ్వూరు మండలం మద్దూరు గ్రామానికి చేరుకుని ఎస్టీ ప్రజలతో సమావేశమవుతారు. సాయంత్రం 4గంటలకు రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. మంగళవారం ఉదయం 9 నుంచి 11గంటల వరకు ఎస్టీల నుంచి, సంఘాల ప్రతినిధుల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. ఉదయం 11గంటలకు కలెక్టర్, ఎస్పీలతో సమావేశం అవుతారని జ్యోతి చెప్పారు.

గుంటూరు మాలల సింహగర్జనకు తరలివెళ్లిన దళితులు

కడియం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరులో జరిగిన మాలల సింహగర్జనకు కడియం మండలం పొట్టిలంక నుంచి దళితులు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా దళితనాయకుడు నక్కా వెంకటరత్నరాజు మాట్లాడుతూ దళిత నాయకులు అంబటి సత్యనారాయణ ఆధ్వర్యంలో గుంటూరు మాలల సింహగర్జనకు తరలివెళుతున్నట్టు తెలిపారు. గుంటూరు వెళ్ళిన వారిలో నక్కా వెంకటరత్నరాజు, అంబటి రాజారత్నం, రేగుళ్ళ అరుణ్‌కుమార్, నక్కా బాబి, దాసి రాజు, బడుగు వెంకన్న తదితరులు ఉన్నారు.

వైభవంగా దత్త జయంతి వేడుకలు

కోరుకొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పవిత్ర మార్గశిర మాసం పౌర్ణమి ఆదివారం కోరుకొండ పెట్రోల్ బంకు ఎదురుగా గల సాయిబాబా ఆలయం సన్నిధిలో దత్త జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పంచామృత అభిషేకాలు, అర్చనలు జరిగాయి. గురుదత్త పారాయణం, దత్తాత్రేయ వైభవనం, దత్తాత్రేయ అవతారవిశేషాలు, అర్చక స్వాములు భక్తులకు వివరించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు, కోరుకొండపరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

బిక్కవోలు జెడ్పీహెచ్ఎస్ ప్లస్‌కు క్రీడా సామగ్రి బహూకరణ

బిక్కవోలు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెంది కాకినాడలో నివాసముంటున్న పారిశ్రామిక వేత్త గుణ్ణం చంద్రమౌళి బిక్కవోలు జెడ్పీహెచ్ఎస్ ప్లస్‌కు రూ.31వేల విలువైన క్రీడాసామాగ్రిని బహూకరించారు. ఆది వారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన హెచ్ఎం పి.వీరప్రభాకరరావుకు వీటిని అందజేసారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ, వాలీబాల్ సంఘ కార్యదర్శి యార్లగడ్డ బంగార్రాజు, అనపర్తి జోన్ పీడీ అసోసియేషన్ కార్యదర్శి టీవీవీఎస్. రాఘవరెడ్డి, పాలచర్ల రామకృష్ణచౌదరి పాల్గొన్నారు.


బిక్కవోలు జెడ్‌పీ హెచ్ఎస్ ప్లస్ హెచ్ఎంకు క్రీడా సామాగ్రిని అందజేస్తున్న దేశం నేత చంద్రమౌళి

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్

● నూతన కార్యదర్శిగా రామకృష్ణ ఎన్నిక



సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో ప్రచారం చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. ఆదివారం తాడితోటలో సీపీఎం రాజమహేంద్రవరం నగర మహాసభ జరిగింది. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ద్వారా ఆర్ఎస్ఎస్ తన విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం 13 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కర్రి రామకృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులుగా బి.పవన్, బీవీ పూర్ణిమరాజు, జరీన, సరోజ్, సభ్యులను ఎన్నుకున్నారు.

రైతుల సంక్షేమానికి కూటమి కృషి

గారపాటి అమరనాథ్


కడియం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి కృషి చేస్తుందని సీనియర్ టీడీపీ నాయకులు గారపాటి శ్రీఅమరనాథ్ తెలిపారు. ఇటీవల జరిగిన నీటిసంఘం ఎన్నికల్లో జేగురుపాడు గ్రామం నుంచి ఎన్నికైన ఐదుగురు డైరెక్టర్లను దుశ్శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా అమరనాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రైతుల సంక్షేమమే ధ్యే యంగా పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, కూటమి నాయకులు నాగిరెడ్డి రామకృష్ణ, మర్రెడ్డి రమేష్, వల్లూరి మోహన్, వనమాలి బాలాజీ ఉన్నారు.

కృష్ణాష్టమి వేద స్వస్తి కార్యక్రమాలకు రూ.22 లక్షల అందజేత

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సభాపతి తెలికిచెర్ల రాధాకృష్ణ మూర్తి ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు, కృష్ణాష్టమి వేద స్వస్తి కార్యక్రమాలకు రూ.22 లక్షలు ప్రకటించారు. చందా సత్రం ట్రస్టు కార్యాలయంలో కార్యదర్శి కేటీ రామారావు అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. శ్రీఉమా మార్కండేశ్వర లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన, వేద ప్రవచనం పరిషత్ నిధి తాలూకు రూ.22 లక్షల చెక్కును రాజమహేంద్రవరం వేద పరిషత్ కార్యదర్శి హోతా శ్రీరామచంద్రమూర్తి, వేణుగోపాల్‌రావు, సత్యనారాయణరావులకు అందజేశారు. కోశాధికారి వి.అప్పయ్య శాస్త్రి, కళారత్న పీఎస్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



శివకేశవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
కొవ్వూరులో ప్రారంభించిన డిపో మేనేజర్ కుమార్... 8లో





పోలవరానికి సీఎం చంద్రబాబు

ఉదయం 10.50 గంటలకు పోలవరం సందర్శనకు సీఎం చంద్రబాబు

ఆర్అండ్ఆర్, భూసేకరణపై సమీక్ష

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఉదయం పది గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.45గంటలకు పోలవరం ప్రాజెక్టు వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ఆయనకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రనిధులు, అధికారులు స్వాగతం పలుకుతారు. 10.50 గంటలకు బయల్దేరి పోలవరం ప్రాజెక్టు సైట్‌లోకి వెళతారు. 12.05 గంటల వరకు గ్యాప్-1, వైబ్రో కాంపాక్షన్, గ్యాప్-2 పనులను పరిశీలించి డయాఫ్రంవాల్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తారు. అక్కడి నుంచి బయల్దేరి 12.20 గంటలకు పోలవరం గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 12.50 గంటల వరకు పోలవరం ఆర్అండ్ఆర్, భూసేకరణ పరిస్థితిపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 1.15 గంటల వరకు మీడియా సమావేశం నిర్వహిస్తారు. 1.25 గంటలకు హెలికాప్టర్లో బయల్దేరి 2.15 గంటలకు వెలగపూడిలోని సెక్రటేరియట్‌కు చేరుకుంటారు.

ఇక్కడి నుంచే షెడ్యూల్ ప్రకటన?

ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి అవసరమైన షెడ్యూల్‌ను చంద్రబాబు ఇక్కడి నుంచే ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో సీఎం హోదాలో చంద్రబాబు పోలవరం పనులను పరుగులు పెట్టించిన సంగతి తెలిసిందే. ప్రతి సోమవారం పోలవరం వచ్చేవారు. 2019కి సుమారు72 శాతం పనులు పూర్తి చేయించారు. స్పిల్‌వే గేట్లు కూడా పెట్టి ఒక కొలిక్కి తెచ్చారు. ఎగువ కాఫర్ డ్యామ్, డయాఫ్రంవాల్‌లను నిర్మించారు. దిగువ కాఫర్ డ్యాం పనులు మొదలుపెట్టారు. కుడి ప్రధాన కాలువ పనులను ఒక కొలిక్కి తేగా, ఎడమ ప్రధాన కాలువ పనులు కూడా పరుగులు పెట్టించిన సంగతి తెలిసిందే. మరోపక్క పోలవరం విద్యుత్ ప్రాజెక్టు పనులను కూడా మొదలు పెట్టించారు. కానీ 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో రివర్స్ టెండరింగ్, ఎంక్వయిరీలు అంటూ జాప్యం చేసి చివరకు ప్రాజెక్టును కదలకుండా చేసిన సంగతి తెలిసిందే.

● (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కూటమి రాకతో..చిగురించిన ఆశలు

2019కు ముందు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రం నలుమూలల నుంచి సందర్శకులను రప్పించి ప్రాజెక్టు పనులు చూపించారు. వైసీపీ ప్రభుత్వంలో కనీసం మీడియా కూడా పోలవరం ప్రాజెక్టు చూడ్డానికి వెళ్తే అనేక నిబంధనలు విధించేవారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి భారీ మెజార్టీతో అధికారం లోకి రావడంతో పాటు తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ఆశలు చిగురించాయి. కేంద్రం కూడా తోడవ్వడంతో ప్రాజెక్టు త్వరగా పూర్తవుతుందనే నమ్మకం ఏర్పడింది.

వైసీపీ హయాంలో అస్తవ్యస్తం

వైసీపీ హయాంలో ఏమి జరిగిందో కానీ డయాఫ్రంవాల్ దెబ్బతింది. ఇవాళ దీనికి సమాంతరంగా కొత్త డయాఫ్రంవాల్ నిర్మించనున్నారు. గతనెలలో నిపుణుల కమిటీ పర్యటించి డయాఫ్రంవాల్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అమెరికా, కెనడా నిపుణులతో కలసి పీపీఏ, సీడబ్ల్యూసీ, జలవనరుల శాఖ అధికారులు, ఇతర నిపుణులు కలిసి గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దెబ్బతిన్న డయాఫ్రంవాల్‌కు సమాంతరంగా మరో డయాఫ్రంవాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. నాలుగు రోజుల పాటు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డయాఫ్రంవాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణం, డిజైన్లు, మెటీరియల్ ఏమి వాడాలి, టెస్ట్‌లు ఎలా చేయాలనే దానిపై పోలవరం ప్రాజెక్టు వద్ద వర్క్ షాపు నిర్వహించిన సంగతి తెలిసిందే. చివరిరోజు రాజమహేంద్రవరంలోని మంజీరా ఇంటర్నేషనల్ హోటల్‌లో నిపుణుల కమిటీ ఫైనల్ మీటింగ్ జరిగింది. సుమారు 4గంటల సమయం పాటు అక్కడ నిపుణులు, అధికారులు, కాంట్రాక్టర్, కన్సల్టెన్సీ నిపుణులు చర్చించారు. ప్రస్తుతం ఉన్న డయాఫ్రంవాల్‌కు 6 మీటర్ల దూరం నుంచి సమాంతరంగా కొత్త డయాఫ్రంవాల్ నిర్మించనున్నారు. దీని డిజైన్లు, వాడవలసిన మెటీరియల్స్, వాటి నాణ్యత ఎలా ఉండాలి. ఎటువంటి టెస్ట్‌లు నిర్వహించాలనే అంశంపై చర్చ జరిగింది. అఫ్రీ కన్సల్టెన్సీ డిజైన్, మెటీరియల్స్ నాణ్యత వివరాలపైనా చర్చించారు. డయాఫ్రంవాల్ పనులు జనవరి నుంచి మొదలు కానున్నాయి. పనుల షెడ్యూలును చంద్రబాబు స్వయంగా ఇక్కడే ప్రకటించే అవకాశం ఉంది. డయాఫ్రంవాల్ పనులు మొదలెట్టిన తర్వాత ప్రధాన డ్యామ్ ఈసీఆర్ఎఫ్ పనులు మొదలుపెట్టి 2027కు పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు వెళ్లనున్నారు.

నేడు జీజీహెచ్ అభివృద్ధి సంఘ సమావేశం



కూటమి ప్రభుత్వంలో తొలిసారి కావడంతో ప్రాధాన్యత

వైద్య సేవల్లో నిర్లక్ష్యం, ఇతర సమస్యలపై చర్చించే అవకాశం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీజీహెచ్) అభివృద్ధి సంఘం సమావేశం సోమవారం జరగనుంది. చైర్మన్, కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ఆసుపత్రిలోని ఎంసీహెచ్ మీటింగ్ హాలులో సమావేశం ఏర్పాటుచేశారు. ఆసుపత్రి అభివృద్ధి సంఘం సభ్యులైన ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సభ్యులందరికీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ సమాచారం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. కలెక్టరగా ప్రశాంతి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కూడా ఇదే కావడం గమనార్హం. గతంలో పలుమార్లు సమావేశం జరిపేందుకు ప్రయత్నాలు చేసినా అనివార్య కారణాల వల్ల వాయిదాపడ్డాయి. ఈ నేపథ్యంలో జరగనున్న తొలి సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు, ఏమి చర్చిస్తారు అనేదానిపై ఆసక్తి నెలకొంది.

జిల్లా ఆసుపత్రి నుంచి బోధనాసుపత్రి స్థాయికి ఎదిగినాజీజీహెచ్‌లో కీలకమైన రేడియాలజీ విభాగానికి రేడియాలజిస్ట్ లేకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. కొన్ని నెలలుగా ఈ సమస్య వేధిస్తున్నా పరిష్కారం కాలేదు. దీంతో ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ స్కానింగ్ రిపోర్టులుసకాలంలో అందక రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సీటీ స్కాన్ రిపోర్టులు రావడానికి రెండు, మూడు రోజుల సమయం పడుతోంది. ఎక్స్‌రే విభాగంలోనూ సేవలు ఆలస్యం అవుతున్నాయి. ఎక్స్‌రే తీసిన తర్వాత అక్కడి టెక్నీషియన్లు పది, ఇరవై ఫోటోలను ఒకేసారి సంబంధిత డాక్టర్లకు వాట్సాప్‌లో పంపుతున్నారు. ఒక్కోసారి నెట్ సిగ్నల్ సరిగా లేకపోతే వాటిని డాక్టర్లు చూడలేక వైద్య సేవల్లో జాప్యం జరుగుతోంది. మరోపక్క సాంకేతిక కారణాలతో ఎంఆర్ఐ పనిచేయకపోవడంతో ఎంఆర్ఐ కోసం డాక్టర్లు బయటకు రాస్తున్నారు. అక్కడ ఉచితంగానే ఎంఆర్ఐ చేస్తున్నా వెళ్లి చేయించుకోవడం, రిపోర్టు పట్టుకుని మళ్లీ ఆసుపత్రికి రావడం వల్ల రోగులు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. సీటీ స్కాన్, ఎక్స్‌రే సేవల్లో తీవ్ర జాప్యం నెలకొంటోంది. ఇలా ఒక్క రేడియాలజిస్ట్ లేకపోవడంతో సంబంధిత సాంకేతిక వైద్య సేవలన్నింటిపైనా తీవ్ర ప్రభావం పడుతోంది.

న్యూరోసర్జన్ విభాగంలోనూ సమస్యలున్నాయి. న్యూరోసర్జన్ ఉన్నా థియేటర్ లేకపోవడంతో సర్జరీలు జరగట్లేదు. మరోపక్క జనరల్ మెడిసిన్ విభాగంలో రోగులకు అందించే అత్యవసర వైద్య సేవలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెడికల్ జనరల్ వార్డుల్లో ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులను చూడ్డానికి సంబంధిత వైద్యులు సకాలంలో రావట్లేదని, గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందనే ఫిర్యాదులు ఎమ్మెల్యేకు ఆసుపత్రి అధికారులకు అందుతున్నాయి.

వైద్య సేవల తీరు మారేనా ...

రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇప్పటికే పలుమార్లు జీజీహెచ్‌కు వచ్చి రోగుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. వాటిని ఆసుపత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. కొన్ని సందర్భాల్లో వైద్యులపైనా ఆయన గట్టి హెచ్చరికలు చేశారు. అసెంబ్లీలోనూ ఆసుపత్రి సమస్యలను ప్రస్తావించారు. అయినా వైద్య సేవల్లో నిర్లక్ష్యం పోవడం లేదనే ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం జరిగే హెచ్‌డీఎస్ సమావేశంలో సిటీ ఎమ్మెల్యే ఏం మాట్లాడతారనేది ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. జీజీహెచ్ ఉన్నతాధికారులు ఆసుపత్రిలోని సౌకర్యాలు, ఇతర సమస్యలతో పాటు ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల వివరాలను అజెండాలో పెట్టారు. ఇలా వీటన్నింటిపైనా సమావేశంలో కాస్త వాడివేడిగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే... సోమవారం సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వస్తున్నారు. దానికి కలెక్టర్ హాజరయ్యే అవకాశం ఉందని, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం నిర్వహిస్తారని సమాచారం.

కన్నేశారు!

అసైన్డ్ భూముల్లో యథేచ్ఛగా లే-అవుట్లు

కాలువలను పూడ్చి లే-అవుట్లకు రహదారులు

చోద్యం చూస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ, రుడా అధికారులు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంతా మా ఇష్టం... మమ్మల్ని అడిగే వారెవరు... ఏదైనా వస్తే మేము చూసుకుంటాం... అంటూ నాయకులు భరోసా ఇస్తుండడంతో రెవెన్యూ అధికారులు వారికి వత్తాసు పలుకుతూ చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అడంగళ్లలో పేరు మార్పులు, ప్రభుత్వ భూములు ఇతరులకు బదలాయింపు, చివరికి అసైన్డ్ భూములను అమ్ముకు నేందుకు, ఆపై భూములను ఫిల్లింగ్ చేసి లే-అవుట్లుగా మార్చేందుకు కూడా రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సాదారణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీల స్థితిగతులను బట్టి వారిలో కొందరికి ప్రభుత్వం భూములను, మరికొందరికి స్థలాలను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. అయితే ఆ భూమిపై ఫలసాయం మాత్రమే అనుభవించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిని అమ్మడం కానీ, లే-అవుట్లు వేయడం కానీ చేయకూడదు. ఇక్కడ అలాంటిదేమీలేదు...

రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వున్న గ్రామంలోనే అసైన్డ్ భూమిలో వున్న కొబ్బరి చెట్లను నరికి ఆగమేఘాలపై ఎర్ర మట్టితో ఫిల్లింగ్ చేసి లే-అవుట్ వేసేందుకు సర్వం సిద్ధం చేశారు. ధవళేశ్వరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.47/1ఎ1లో 0.4150 ఎకరాలు వీర్రాజు పేరున, సర్వే నెం.47/1ఎ2లో 0.4150 ఎకరాలు సత్యనారాయణ పేరున వున్నాయి. అయితే అవి వీరికి గతం లో ఎలా సంక్రమించాయో తెలియదు. అడంగల్‌లో సదరు భూముల పేరున శిస్తుకట్టిన గయాల్, అసైన్డ్ ల్యాండ్ డి-పట్టాగా అడంగల్‌లో నమోదైంది. సర్వే నెం.18లో సుమారు 23 సెంట్ల కాలిబాటను కూడా సదరు వ్యక్తులకు ధారాదత్తం చేశారు. ఈ భూమిని రూరల్ నియోజకవర్గ పరిధిలో ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఒక నేతకు అమ్మినట్టు, అడ్వాన్స్‌గా సుమారు రూ.50లక్షల వరకు చేతులు మారినట్టు సమాచారం.

ఇరిగేషన్ భూమికి సంబంధించి అదే గ్రామంలో సర్వే నెం.216, 211ల్లో పంట కాలువను మూసివేసి లే-అవుట్ మార్గంగా చూపించి 'రుడా' నుంచి అనుమతులు తెచ్చుకున్నట్టు తెలిసింది.

ధవళేశ్వరం పంచాయతీ పరిధిలో ఇరిగేషన్ స్థలాలైన సర్వే నెం.72/1ను ఆక్రమించుకుని వాటర్ సర్వీసింగ్ స్టేషన్లు, సర్వే నెం.75, 76, 47/1 ఆక్రమించుకుని నర్సింగ్ కాలేజీ, విద్యా సంస్థల హాస్టళ్లతో పాటు పలు వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

సర్వే నెం.144లో దేవదాయ శాఖ స్థలాలను ఆక్రమించుకుని ఏకంగా ఇళ్లే కట్టేసుకున్నారు. ఇందుకు పంచాయతీ అధికారులు ప్లాన్ అప్రూవల్స్ మంజూరు చేసినట్టు తెలిసింది.

అయితే ఫిల్లింగ్‌కు మట్టిని ఎక్కడి నుంచి తెచ్చారు. సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బందికి తెలియకుండానే ఇదంతా జరిగిందా అన్నదే ప్రశ్న. అధికారులు వారిపై ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాలి.



ఎర్ర మట్టితో భూమిని చదును చేసిన దృశ్యం

రైతులను పట్టాలు తీసుకురమ్మన్నాం...

అసైన్డ్ భూముల్లో లే-అవుట్లు వేసేందుకు ఎర్ర మట్టి ఫిల్లింగ్ చేసిన విషయమై రూరల్ తహసీల్దారు కుమార్‌ను వివరణ కోరగా.... ఈ అంశం తమ దృష్టికి వచ్చిందన్నారు. స్థలాన్ని పరిశీలించి పట్టాలు తీసుకురమ్మని సంబంధిత రైతులకు కబురు చేశామని తెలిపారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ, అధికారులు

భాషాప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన యోధుడు పొట్టి శ్రీరాములు

జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భాషాప్రయుక్త రాష్ట్రం కావాలని దేశంలో తొలిసారిగా పోరాడి ప్రాణాలర్పించిన యోధుడు పొట్టి శ్రీరాములు అని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. అమరజీవి వర్ధంతి సందర్భంగా రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌లో ఆ మహనీయుని చిత్రపటానికి పలువురు పుష్పమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడేవారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని శ్రీరాములు ఆమరణ దీక్ష చేశారని గుర్తు చేశారు. అటువంటి మహనీయులు స్ఫూర్తితో మనమంతా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీపీవో ఎల్.అప్పలకొండ, బీసీ సంక్షేమ శాఖ జిల్లా ఇన్చార్జి అధికారి కేఎస్ జ్యోతి, పౌరసరఫరాల జిల్లా మేనేజరు టి.రాధిక, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఆలీ, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అధికారులు నివాళులర్పించారు. డీఈవో కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి జిల్లా విద్యా శాఖ అధికారి వాసుదేవరావు నివాళులర్పించారు.

రాజమహేంద్రవరం అర్బన్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం, స్ఫూర్తిని భావితరాలకు తెలియజేసేందుకు ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినోత్సవంగా కూటమి ప్రభుత్వం నిర్ణయించి జరపడం హర్షణీయమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలుపుతాం, నవ్యాంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.



సంఘటనా ప్రాంతంలోనే దాడికి ఉపయోగించిన కత్తి

వేట్లపాలెం... రక్తసిక్తం

వేట్లపాలెం రక్తసిక్తమైంది.. ఇంటి స్థలం సరిహద్దు వివాదం.. పెను విషాదానికి దారి తీసింది. ఒక వర్గం మరొక వర్గంపై చేసి దారుణ దాడిలో మూడు నిండు ప్రాణాలు బలవ్వగా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామ శివారులోని దళిత చెరువు ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈ దారుణం జరిగింది.

కోట సత్తెమ్మ అమ్మవారి తిరునాళ్లు ప్రారంభం

నిడదవోలు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోట సత్తెమ్మ అమ్మవారి తిరునాళ్లు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవులపల్లి కుటుంబీకులతో స్మార్త ఆగమ ఆచారం ప్రకారం కలశస్థాపన చేయించి ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన, విశేష పూజలు జరిపారు. ఉదయం చండీ పారాయణ, సాయంకాలం చండీ హోమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను దేవస్థానం సహాయ కమిషనరు వి.హరి సూర్యప్రకాష్ పర్యవేక్షించగా ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కలశస్థాపన చేసి పూజలు చేస్తున్న దేవులపల్లి కుటుంబీకులు

శెట్టిబలిజ కులాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వెన్నుదన్ను: మంత్రులు దుర్గేష్, సుభాష్



దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం లాలాచెరువు సెంటర్లో శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. రాత్రి జరిగిన వెన్నుదన్ను సభలో శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు, 15 మంది సభ్యులతో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రమాణం చేయించారు. సభలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కార్మిక శాఖ మంత్రి సుభాష్, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, తెలంగాణ శెట్టిబలిజ సంఘం నేతలు జయప్రకాష్‌నారాయణ, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ప్రసంగించారు. శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, యాత కులాల అభివృద్ధికి పాటుపడింది టీడీపీయే అని గుర్తు చేశారు. శెట్టిబలిజ, గౌడ, శ్రీయన, ఈడిగ కులాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గీత కులాల అభివృద్ధికి కార్పొరేషన్ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతి ప్రయోజనాలను కాపాడతానని చైర్మన్ సత్తిబాబు హామీనిచ్చారు. వెన్నుదన్ను సభలో శెట్టిబలిజ సంఘం నేతలు రెడ్డి రాజు, సానబోయిన రామారావు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన గీత కులాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- రాజమహేంద్రవరం సిటీ



ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

శివకేశవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



తిరుపతికి తొలి ప్రత్యేక బస్సును పంపిస్తున్న డీఎం కుమార్

కొవ్వూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసంలో శివకేశవ క్షేత్రాలతో పాటు శక్తి పీఠములకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులను నడుపుతున్నట్టు కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. ఆదివారం కొవ్వూరు నుంచి వరాహిమాత ఆలయం, తొలి తిరుపతిలకు 2 యాత్ర స్పెషల్ సర్వీసులను పంపించారు. కుమార్ మాట్లాడుతూ కార్తీకమాసంలో కొవ్వూరు డిపో నుంచి 73 యాత్ర స్పెషల్ పంపించామన్నారు. ధనుర్మాసంలోను శివకేశవుల క్షేత్రాలకు, నవజనార్ధన పారిజాతాలు, సప్తశ్రీనివాసాలు, శివకేశవ దర్శిని వంటి క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామన్నారు. ప్రత్యేక సర్వీసులు ఉదయం 6గంటలకు డిపో నుంచి బయలుదేరి సాయంత్రం 6గంటలకు తిరిగి డిపో చేరతాయన్నారు. వరాహిమాత - తొలి తిరుపతి యాత్ర స్పెషల్ టిక్కెట్టు ఒక్కరికి రూ.350 అన్నారు. ఈ యాత్రలో కాండ్రకోట నూకాలమ్మ, తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి, విరవలో శ్రీరామలింగేశ్వరస్వామి, పిఠాపురంలో కుక్కుటేశ్వర స్వామి, పురుహూతికా దేవి, శ్రీపాద శ్రీవల్లభ, దత్తాత్రేయస్వామి, పవరలో మొసలి రామలింగేశ్వరస్వామి, సర్పవరంలో భావన్నారాయణస్వామి, కాకినాడ కొవ్వూరులో వరాహిమాత దర్శనం చేయించడం జరుగుతుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన



చివటంలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చివటం గ్రామంలో పుంతలో ముసలమ్మ, కనకదుర్గ అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గతంలో ఉన్న చిన్న ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాతల సహకారంతో ఆలయాన్ని పునః నిర్మాణం చేపట్టారు. గ్రామానికి చెందిన గమిడి భాస్కరరావు కుటుంబ సభ్యులైన గమిడి రామనాగేశ్వరరావు, వెంకటసీతాసుగుణ, శ్రీను, శ్యామల, చలంచర్ల శ్రీనివాసు దేవి దంపతులు శంకుస్థాపన, విగ్రహావిష్కరణకు సుమారు రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు ఆదివారం ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. పూర్తి నిర్మాణానికి రూ.25లక్షలు వ్యయం అవుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీవీఎస్ నారాయణ, స్థానికులు చిలుకూరి శ్రీనివాస్, కూనపరెడ్డి రంగా, గంటిన వెంకన్న, దాసరి మునీశ్వరావు, అబ్బిరెడ్డి శివసతీష్, కె.ఫణిదినేష్, ఎమ్. మురళీకృష్ణ, ఎస్. వెంకటేష్, మడిపల్లి రిషి, నందం వీర్రాజు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

'కాలువలను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం'



నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల అధ్యక్షులతో మంత్రి దుర్గేష్

పెరవలి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి కాలువలను నిర్లక్ష్యం చేసిందని, దీంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా గెలుపొందిన కానూరు, ఖండవల్లి, పేకేరు నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డైరెక్టర్‌లు నిడదవోలులోని కార్యాలయంలో మంత్రి దుర్గేష్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన దుర్గేష్ మాట్లాడుతూ సాగునీటి కాలువ అభివృద్ధికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోందని, నీటి సంఘ అధ్యక్షులు బాధ్యతగా పని చేసి రైతులందరికీ సక్రమంగా సాగునీరందేలా చూడాలన్నారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మానవత సంస్థకు ఫ్రీజర్ బాక్సు అందజేత



చిట్యాలలో ఫ్రీజర్‌ను ప్రారంభిస్తున్న రత్నాజీచౌదరి దంపతులు

గోపాలపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మానవత్వం మూర్తీభవించినప్పుడే సమాజానికి నిస్వార్థమైన సేవలు అందుతాయని మానవత స్వచ్ఛంద సంస్థ మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, మండలాధ్యక్షుడు పప్పు సత్య కృష్ణారెడ్డి అన్నారు. మండలంలో చిట్యాల గ్రామానికి చెందిన కొండేపాటి వీరకృష్ణ జ్ఞాపకార్థం వారి మనవలు, మనవరాళ్ళు రూ.50 వేలు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఫ్రీజర్ బాక్సును ఆదివారం మానవత స్వచ్ఛంద సంస్థకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కొండేపాటి రత్నాజీ చౌదరి బాక్సును ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ, కుక్కల కీర్తికుమార్, గడా జోగేంద్రప్రసాద్, గద్దే శేషగిరిరావు, నందిన సుబ్రహ్మణ్యం, ఎలిపే నరేంద్ర, జుత్తిగ సూర్యచంద్రం, మద్దిపాటి గంగరాజు పాల్గొన్నారు.

క్షతగాత్రులైన దంపతులు ఆసుపత్రికి తరలింపు

మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్యే ముప్పిడి



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన దంపతులను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మానవత్వాన్ని చాటుకున్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన అడబాల వీరబాబు, శివ గంగభవాని బైక్‌పై బంగారమ్మపేట బయలుదేరారు. వాడపల్లి గ్రామశివారులో ప్రక్కనే వస్తున్న మోటారుసైకిల్ సడన్‌గా ప్రక్కకు తిరగడంతో ప్రమాదానికి గురయ్యారు. ఇద్దరూ బైక్ పైనుంచి కిందపడి పోవడంతో గాయాల పాలయ్యారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ కారు ఆపి క్షతగాత్రులను పరామర్శించి 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంటుకు ఫోన్‌చేసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కొవ్వూరు ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఇద్దరినీ అత్యవసర వైద్యం కోసం రాజమహేంద్రవరం రిఫర్ చేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్
గృహోపకరణాల దగ్ధం

గోపాలపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్ కారణంగా గోపాలపురం గ్రామానికి చెందిన ఎలేటి భూషణం ఇంటిలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. దీంతో ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్, ఏసీ, ఇతర వంట సామగ్రి మొత్తం కాలిపోయాయన్నారు. స్థానికుల సాయంతో మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకపోవడంతో జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారి జీ.అబ్రహం ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలును అదుపు చేశారు. ఆస్తినష్టం సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని అగ్నిమాపక అధికారి తెలిపారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం బస్తాలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. కొవ్వూరు మండలం మద్దూరు గ్రామానికి చెందిన బోడపాటి వెంకటేశ్వర్లు కమీషన్ ప్రాతిపదికన ధాన్యం వ్యాపారం చేస్తున్నాడు. 2023 దాళ్వా సీజన్‌లో కొవ్వూరుకు చెందిన దుద్దుపూడి సూరిబాబు వద్దనున్న 1200 ధాన్యం బస్తాలను వెంకటేశ్వర్లు రైసుమిల్లుకు పంపించాడు. అప్పటి నుంచి డబ్బులు ఇవ్వాలని సూరిబాబును అడగగా ఇవ్వకపోవడంతో వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 400 మందికి వైద్య సేవలందజేశామని, రోగులు, సహాయకులకు అన్నదానం నిర్వహించామని రామకృష్ణ మిషన్ మేనేజర్ రఘువీరనంద తెలిపారు. డాక్టర్లు జీవీ రామారావు, కస్తూరి సుబ్రహ్మణ్యం, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్‌కుమార్, జీఎస్ఎల్ వైద్యులు సేవలు అందించారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జమిందారీ మెట్ట వద్ద వేంకటేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం నుంచి వచ్చే నెల 13 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్తలు శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం-మీనాక్షి దంపతులు తెలిపారు. ప్రతిరోజూ సుప్రభాత సేవ, అర్చన, తిరుప్పావై సేవాకాలం, మంగళాశాసనం జరుగుతాయని వివరించారు.



కొవ్వూరులో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి



నిడదవోలులో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ



తాళ్లపూడిలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- 'అమరజీవి' వర్ధంతి
- నివాళులర్పించిన నాయకులు, అధికారులు
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీల నిర్వహణ

కొవ్వూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పొట్టి శ్రీరాములు ప్రాణార్పణతో ఉభయ రాష్ట్రాలలో తెలుగు ప్రజలంతా ఒక్కటిగా స్వేచ్ఛగా జీవిస్తున్నారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే ప్రసాద్ అధ్యక్షతన మెయిన్‌రోడ్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటి సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు ముఖ్యఅతిథులుగా పాల్గొని జాతిపిత మహాత్మ గాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం ఎన్నటికి మరువరానిది. 1952లో మద్రాసులో బులుసు సాంబమూర్తి నివాసంలో శ్రీరాములు చేపట్టిన దీక్ష ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు అయ్యిందన్నారు. పొట్టి శ్రీరాములు, మహాత్మగాంధీ, అల్లూరి సీతారామరాజు, బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయులంతా జాతీయ నాయకులని, వారందరికీ కులాల ముద్ర వేయడం దురదృష్టకరమన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు మద్దుల సత్యనారాయణ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు మరణించిన రోజు డిసెంబరు 15ను ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, పెనుమాక జయరాజు, కొల్లేపర శ్రీనివాస్, తుమ్మలపల్లి రమేష్, మద్దుల నాని, కోణాల కిషోర్, నాళం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలు మెయిన్‌రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీరాములు తుదిశ్వాస వరకు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన అమరజీవి అని, తెలుగు మాట్లాడే వారి కోసం ఒక రాష్ట్రాన్ని సాధించారన్నారు. కార్యక్రమంలో పచ్చి పులుసు ఆదిబాబు, కొనిజేటి నారాయణ, కేదారిశెట్టి రవి కుమార్, వలివేటి సుబ్బారావు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించేందుకు శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారని, ఆయన వర్ధంతిని కూటమి ప్రభుత్వం ఆత్మార్పణ దినంగా ప్రకటించడంతో ఆర్యవైశ్య నాయకులు సింహాద్రి జనార్ధనరావు తదితరులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక బస్టాండు సెంటరులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యండపల్లి శేషగిరిరావు పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోకవరపు మాణిక్యం, అప్పన గుప్త, కనల రాజా, కొల్లేపర చిన్నా, అప్పన హనుమంతరావు, కంకిపాటి శివ, వినయ్, సాయిబాబు పాల్గొన్నారు. శ్రీరాములు వర్ధంతి రోజును ఆత్మార్పణ దినోత్సవం పేరుతో ప్రభుత్వ కార్యక్రమంగా నిర్ణయించడంతో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు శ్రీరాముల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు రాష్ట్రం ఏర్పాటు కావడానికి శ్రీరాములు చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సురేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీరాములు, పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశానికి వారిద్దరూ చేసిన సేవలను కొనియాడారు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లైబ్రరీ కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు, గ్రంథ పాలకుడు జి.కృష్ణారావు, ఆలపాటి నాగేశ్వరరావు, జి.బాలాజీ, కేవీ కృష్ణారావు, సింహాద్రి రామచంద్రరావు, పాతూరి సుబ్బారావు, పాఠకులు పాల్గొన్నారు.

పెరవలి: అజ్జరంలోని ప్రాథమిక పాఠశాల నెంబర్-1లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి హెచ్ఎం ఎంఆర్‌వీఎస్ఎన్ రెడ్డి నివాళులర్పించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే ముక్కామల, తీపర్రు గ్రంథాలయాల్లో శ్రీరాములు చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో గ్రంథ పాలకులు వెంకటేశు, జయలక్ష్మి పాల్గొన్నారు.

దేవరపల్లి: పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని ఆయనను ప్రతీ ఆంధ్రుడు స్మరించుకోవాలని పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీకాకుళపు కాళీకృష్ణ అన్నారు. దేవరపల్లిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తగుండి బాబురావు, సుతాపల్లి రామారావు పాల్గొన్నారు.



అజ్జరంలో ఏపీ మ్యాప్‌లో అమరజీవి అని రాసిన విద్యార్థులు



ఉండ్రాజవరంలో పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



దేవరపల్లిలో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాళీకృష్ణ

కరాటే పోటీల్లో
తపస్వీరెడ్డికి మొదటి స్థానం



పతకాలు అందుకుంటున్న తపస్వీరెడ్డి

నిడదవోలు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిడదవోలుకు చెందిన విద్యార్థి కుంచాల తపస్వీరెడ్డి ఆదివారం తణుకులో జరిగిన జాతీయ స్థాయి ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ అండర్-14 బ్లాక్ బెల్ట్ కేటగిరిలో కటా, కుమిటి విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు. దీంతో పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులు, ప్రముఖులు తపస్వీరెడ్డిని అభినందించారు.

షేక్ సాబ్జీ ప్రథమ వర్ధంతి

కొవ్వూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): షేక్ సాబ్జీ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని యూటీఎఫ్ మండలాధ్యక్షుడు ఆర్.సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, పీవీ రవికుమార్, కె.ఏడుకొండలు, ఎం.జయబాబు, డి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాల నమోదు

ఉండ్రాజవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంగి గ్రామంలో 1000 మందికి టీడీపీ సభ్యతాలు నమోదు చేసినట్టు పార్టీ గ్రామ అధ్యక్షుడు ఈడ్పుగంటి ఉదయ్‌కుమార్(భాను) ఆదివారం తెలిపారు. గ్రామంలో సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పని చేస్తున్నారని ఆయన చెప్పారు. వెయ్యి సభ్యత్వాలు నమోదు చేసిన సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు గ్రామనాయకులను, కార్యకర్తలను అభినందించారు.

ఆత్మార్పణ దినం

నల్లజర్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగంతో సాధించిన రాష్ట్రంలో అందరం కలిసికట్టుగా ప్రగతి సాధించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. ఆదివారం అనంతపల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆత్మార్పణ దినం కార్యక్రమానికి వారిద్దరూ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు.అనంతరం నూతనంగా ఏర్పాటైన మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా కాజు భద్రయ్య, గౌరవాధ్యక్షుడిగా గుళ్ళపూడి వెంకటరత్నం, ఉపాధ్యక్షుడిగా పచ్చిగోళ్ల శ్రీనవాస్, కార్యదర్శిగా చీమకుర్తి ధర్మనాగేంద్రకుమార్ తదితరులు ఎన్నికయ్యారు.

హెల్త్ అసిస్టెంట్ల తొలగింపు సరికాదు

ఏపీ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ప్రసాద్



నెహ్రూ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రసాద్

కొవ్వూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్య సహాయకులను ఉద్యోగాల నుంచి తొలగించడంతో సంభవిస్తున్న మరణాలపై సీఎం చంద్రబాబు చలించారని ఏపీ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ తెలిపారు. కొవ్వూరుకు చెందిన హెల్త్ అసిస్టెంట్ నెహ్రూ ఉద్యోగం పోయిందని తెలుసుకున్న నెహ్రూ తండ్రి ఆశీర్వాదం గుండెపోటుతో మృతిచెందారు. ఉన్న ఉద్యోగాన్ని, తండ్రిని కోల్పోయిన నెహ్రూ కుటుంబాన్ని ప్రసాద్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడు తూ తెలంగాణ హైకోర్టు జీవో 1207ను రద్దు చేయడం, దానిని అనుసరించి ఏపీలో దాదాపు 1200 మంది కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్‌లను ప్రభుత్వం తొలగించిందని, 22 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్న ఉద్యోగులను ఉన్న ఫలంగా రోడ్డుపైకి నెట్టేయడంతో 50 ఏళ్ల వయస్సులో ఏం చేయాలో తెలియక నాలుగు రోజుల వ్యవధిలో ముగ్గురు మృత్యువాత పడ్డారన్నారు. కొడుకుల ఉద్యోగాలు పోయాయని నర్సీపట్నంలో ఇద్దరు తండ్రులు, కొవ్వూరులో ఆశీర్వాదం గుండెపోటుతో మృతిచెందగా, ఉద్యోగం పోతే తన భవిష్యత్ ఏమిటని గుంటూరు మలేరియా సబ్ యూనిట్‌లో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కొల్లి లక్ష్మణ్ మానసిక వేదనతో మృతి చెందాడన్నారు. దీనిపై ఈ నెల 14న నిర్వహించిన ప్రజాదర్బార్‌లో సీఎం చంద్రబాబును కలిసి హెల్త్ అసిస్టెంట్‌ల కుటుంబాల్లో జరుగుతున్న వరుస మరణాల విషయాన్ని తెలియజేశామన్నారు. దీంతో ముఖ్యమంత్రి చలించిపోయారని, ఆయా ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారని ప్రసాద్ పేర్కొన్నారు.

బైబిల్ జ్ఞానగని: ఎమ్మెల్యే మద్దిపాటి

- దేవరపల్లిలో నియోజకవర్గ స్థాయి క్రిస్మస్ వేడుకలు
- హాజరైన పలువురు పాస్టర్లు





క్రిస్మస్ వేడుకలకు హాజరైన క్రైస్తవ విశ్వాసులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బైబిల్‌లో తోటి వారిని ఎలా ప్రేమించాలో రాయబడిందని, బైబిల్ జ్ఞాన గని అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లిలో.. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని పాస్టర్లు అశేష జనవాహిని మధ్య ఆదివారం సాయంత్రం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ ప్రతిఒక్కరు అన్ని మతాలను సమానంగా గౌరవించాలన్నారు. కొంతమంది మతాల మధ్య నిప్పులు పెట్టి రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తున్నారని, దీన్ని కూటమి ప్రభుత్వం సహించదన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో ఏ పౌరుడైనా తనకు నచ్చిన మతాన్ని స్వీకరించవచ్చన్నారు. క్రైస్తవ మతంలో సేవాభావం అధికంగా ఉంటుందని, మిషనరీ స్కూల్స్ ద్వారా నాణ్యమైన విద్య, వైద్యం, అందిచేవారన్నారు. సమాజంలో మంచి పౌరుడిగా ఎదగడానికి మిషనరీ స్కూల్స్ దోహదపడ్డాయన్నారు. మదర్‌థెరిస్సా కుష్టు రోగులను అక్కున చేర్చుకుని ఎన్నో సేవలు చేశారన్నారు. ప్రతీ ఏడాది క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు.పాస్టర్ అల్లూరి విశ్వప్రసాద్ ప్రసంగించారు. పలువురు గాయకులు పాడిన యేసు ప్రభు పాటలు అలరించాయి. విశ్వాసులకు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు, మండలంలోని అన్ని సంఘాల పాస్టర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి అభిషేకాలు



ప్రక్కిలంకలో సుదర్శన లక్ష్మీనరసింహ హోమం

తాళ్లపూడి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ధర్మకర్తలు సొలస గిరిధర గాంధీ, కాశీవిశ్వనాథం ఆధ్వర్యంలో అభిషేకాలు, సుదర్శన లక్ష్మీనరసింహ హోమాన్ని ఆలయార్చకులు, వేద పండితులు నిర్వహిచారు. కార్యక్రమంలో డాక్టర్ రవికు మార్ దంపతులు, గ్రామంలోని పలువురు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

చాగల్లు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చాగల్లులో భక్తాంజనేయస్వామి వ్రత ఉత్సవాల్లో భాగంగా సహస్ర సిందూర్చాన నిర్వహించారు. శ్రీరాజరాజేశ్వరి విద్యార్థులు, చిన్నారులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



చాగల్లులో విద్యార్థుల హనుమాన్ చాలీసా పారాయణం

బాలాత్రిపుర సుందరీకి పూజలు

కొవ్వూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్గశిర పౌర్ణమి సందర్భంగా బాలాత్రిపుర సుందరీదేవికి పూజలు నిర్వహించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సుందరేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి వివిధ రకాల పత్రులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లలిత సహస్రనామ పారాయణం చేశారు. అలాగే గోష్పాదక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆత్మీయ హితకారిణి సమాజం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరానికి చెందిన చిరపూరి సుబ్రహ్మణ్యం, రమాదేవి దంపతులతో అర్చకులు గణపతి, మండప, కలశ పూజలు, చండీ పరదేవతకు అష్టోత్తర పూజ, చండీ హోమం జరిపించారు. కార్యక్రమంలో నళిని వాజపేయి, వాడ్రేవు సాయి కామరాజు, చామర్తి విశ్వనాథరావు, ముప్పి శ్రీరామచంద్రమూర్తి, గంప కృష్ణారావు, వైవీఎస్ కామేశ్వరరావు పాల్గొన్నారు.



కొవ్వూరులో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

దత్తాత్రేయ జయంతి

నిడదవోలు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని బాలాజీనగర్‌లో ఉన్న దత్తసాయి పీఠంలో ఆదివారం దత్తాత్రేయ జయంతి సందర్భంగా పీఠం నిర్వాహకుడు సురేష్‌శర్మ పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి విశేష అభిషేకాలు, హోమం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దత్తాత్రేయుడిని దర్శించుకున్నారు.